నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...
రంగారెడ్డి వికారాబాద్ మేడ్చల్
ఆదివారం 08 మార్చి 2026 పేజీలు 13








# మహిళల భద్రత సమాజం బాధ్యత

- ప్రతి ఒక్కరూ 'స్టాండ్ విత్ హర్'గా నిలవాలి: సీఎం రేవంత్ రెడ్డి
- జేఎన్టీయూలో మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు
- మహిళల రక్షణకు చట్టాలు, పోలీస్ పహారా మాత్రమే సరిపోవనివ్యాఖ్య
- మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం,రాష్ట్రం,దేశంబలపడుతుందన్న సీఎం
- మహిళల సాధికారతకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్ (మార్చి 07):** అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలను జరుపుకోవడం మాత్రమే సరిపోదని, సమాజంలో ప్రతి మహిళ పట్ల మన కుటుంబ సభ్యుల మాదిరిగానే బాధ్యతతో ఆలోచించి అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కెపిహెచ్‌బీలోని జేఎన్టీయూ ఆడిటోరియంలో మహిళా భద్రత వింగ్ అదనపు డీజీపీ చారు సిన్హా ఐపీఎస్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "స్టాండ్ విత్ హర్" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో

మిగతా 3లో

# మగువలే.. సారథులు..!



- జిల్లా స్థాయి కీలక శాఖలో మహిళమణులే
- చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపల్ తొలిపీఠంపై మహిళలే
- మహేశ్వరం ఎమ్మెల్యేగా పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి సారథ్యం

**రంగారెడ్డి, మేజర్‌న్యూస్ (మార్చి 07 ):** అన్ని రంగాల్లో మేముసైతం అంటూ మహిళలు నేడు పోటీ పడుతున్నారు. ఇల్లాలి చదువు ఇంటికే కాదు.. ప్రపంచానికే వెలుగు అని చాటి చెబుతున్నారు. రాజకీయ, అధికార, పారిశ్రామిక రంగాల్లో తమదైన ముద్ర వేస్తున్నారు. జిల్లాలో ఆరు మున్సిపాలిటీలు ఉండగా అందులో ఆమనగల్లు, చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీలు జనరల్‌కు కేటాయించారు. మొయినాబాద్ ఎస్సీ జనరల్, షాద్‌నగర్ బీసీ జనరల్‌కు కేటాయించారు. ఈ సారి మొయినాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీలు

మిగతా 3లో


సబితా ఇంద్రారెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే


షాబాద్ సోనియా దర్శన్, మొయినాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్


దేవర సమత వెంకట్‌రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్


జిల్లా వైద్యాధికారిని సన్మానిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి, మేజర్‌న్యూస్ (మార్చి7) :** మహిళలు అన్ని రంగాలలో రాణించి, సాధికారత సాధించినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి.. మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. మార్పు అనేది ఇంటి నుండే ప్రారంభం కావాలని అన్నారు. విశ్వంలో చాలా గ్రహాలు ఉన్నాయని, భూమి పైన మాత్రమే ప్రాణం ఉన్న

మిగతా 3లో

# విద్యార్థులకు మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**పరిగి, మార్చి 7:** విద్యార్థులకు మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. 99 రోజులపాటు నిర్వహించే ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం పరిగి మండలం తుంకుల గడ్డలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ... విద్యార్థినిలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారంగా పౌష్టిక ఆహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు విధిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తగు మందులను ఇవ్వాలని అదేవిధంగా ఆరోగ్యం పట్ల తగు

మిగతా 3లో

# హ్యాపీ ఉమెన్స్ డే టు ఆల్ ఉమెన్స్

- రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (మార్చి 07):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా మహిళలకు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో సగభాగం ఉన్న మహిళలు నేడు అన్ని రంగాలలో ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నారని తెలిపారు. మహిళల అభివృద్ధి తోనే కుటుంబం, రాష్ట్రం, దేశం కూడా అభివృద్ధి చెందుతాయి అన్నారు. రాణి రుద్రమదేవి, సావిత్రిబాయి పూలే, చాకలి ఐలమ్మ, సరోజిని నాయుడు, ఇందిరాగాంధీ వంటి మహిళలను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తుందని తెలియజేస్తూ మరొకసారి హ్యాపీ ఉమెన్స్ డే టూ ఆల్ ఉమెన్ అని పేర్కొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి





ఆమనగల్లు, మేజర్ న్యూస్ (మార్చి07): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోనిప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జిల్లా వైద్య అధికారిని లలిత దేవి,డిప్యూటీ డి ఎం హెచ్ వో వినోద్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డిల తో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు మనము తీసుకునే ఆహారం, వాతావరణంలో వస్తున్న మార్పులు, ఇతర కాలుష్యాల వలన ప్రతి ఒక్కరు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసుకొని ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. కల్వకుర్తి నియోజకవర్గం లో అత్యధికంగా ముఖ్యమంత్రి సహాయనిధి కింద లబ్ధిదారులకు చెక్కులను అందించడం జరిగిందని గుర్తు చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో స్కిల్ సెంటర్ కోసం స్థల పరిశీలన జరిగిందని త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి స్కిల్ సెంటర్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల అసంపూర్తి భవనాన్ని పూర్తి చేస్తామని,డిగ్రీ కళాశాల భవనిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఆమనగల్ పట్టణంలో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తి కావస్తుందని ఇక్కడి ప్రజలు ప్రవేటు ఆసుపత్రికి వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికల కార్యక్రమంలో అధికారుల పాత్ర కీలకమని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భావన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత, కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, వెంకటయ్య, మహేష్, భాగ్యలక్ష్మి, అనూష, జగన్, నిరంజన్ నాయక్, దుడ్డు కృష్ణ యాదవ్, ధోళి,ఎంపీడీవో కుసుమ మాధురి, ఎంఈఓ పాండు, డిప్యూటీ తాసిల్దార్ వినోద్,ప్రభుత్వ వైద్య అధికారులు మైమున వేగం, మంజులా దేవి, నాగరాజు, ఆస్పత్రి సిబ్బంది తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పాత సర్పంచ్ లకు పెండింగ్ బిల్లులన్ని వెంటనే చెల్లించాలి

### -మాడ్గుల మాజీ ఎంపిపి జైపాల్ నాయక్



మాడ్గుల, మేజర్ న్యూస్ ( మార్చి 07): 2019 గ్రామపంచాయతి ఎన్నికల్లో సర్పంచ్ లుగా గెలుపొంది జి.పి.లలో సొంత నిధులతో పాటు అప్పులు తెచ్చి సైతం అభివృద్ధి పనులు పూర్తి చేసినా కానీ అందుకు సంబంధించిన బిల్లుల కొరకు యేండ్ల కాలంగా ఎదురుచూపులకే పరిమితమైనట్లు మాడ్గుల మాజీ ఎంపిపి జర్పుల జైపాల్ నాయక్ అన్నారు. పాత సర్పంచ్ లకు పెండింగ్ బిల్లులు విడుదల చేసినట్లు పంచాయతిరాజ్ శాఖమంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటుండగా మాడ్గుల మండల అధికారులు మాత్రం పాత సర్పంచ్ లకు విడతల వారీగా బిల్లులు చెల్లిస్తామని పేర్కొంటు పాత సర్పంచ్ లను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం మాడ్గుల మండలం జర్పులతాండ మాజీ సర్పంచ్ జర్పుల హీరాదేవితో కలిసి మాజీ ఎంపిపి జైపాల్ నాయక్ మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ జర్పులతాండ గ్రామపంచాయతిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అప్పటి సర్పంచ్ హీరాదేవి పాలకవర్గం తీర్మాణం మేరకు సి.సి రోడ్లు, వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరిగిందని, ఆయా పనులకు సంబంధించి గతంలో కేవలం లక్ష రూపాయల బిల్లు విడుదల కాగా మిగతా బిల్లుల కొరకు రెండున్నర యేండ్ల కాలంగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ద్వారా జి.పిల పాత బిల్లులు విడుదల చేసినప్పటికి పాత సర్పంచ్ లకు రావాల్సిన పెండింగ్ బిల్లులు మాత్రం మండల అధికారులు విడతల వారీగా చెల్లిస్తామంటున్నట్లు మాజీ ఎంపిపి పేర్కొన్నారు. ఇప్పటికే అభివృద్ధి పనులకు తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక పాత సర్పంచ్ లు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి పాత సర్పంచులకు బకాయి బిల్లులను ఏకకాలంలో చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కాగా పాత సర్పంచ్ ల బకాయి బిల్లుల విషయమై మాడ్గుల ఎంపిఓ వేజన్నను మేజర్ న్యూస్ వివరణ కోరగా ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గ్రాంట్ లో పెండింగ్ లో ఉన్న పారిశుధ్య కార్మికుల మూడు నెలల వేతనాలు చెల్లించడమే కాకుండ పాత బకాయి బిల్లులను కొంత చెల్లించి మిగతా నిధులు జి.పి.లలో ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యవసర అవసరాలకు వాడుకునేలా చూస్తున్నామని తెలిపారు.

# ఈదమ్మ తల్లి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

### మీర్‌ఖాన్‌పేట్‌లో వైభవంగా ఈదమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట




కందుకూరు, మేజర్న్యూస్( మార్చి 07): ఈదమ్మ తల్లి కరుణకటాక్షాలతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆకాంక్షించారు. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్‌లో ఈదమ్మతల్లి విగ్రహావిష్కణ కార్యక్రమం చండి ఉపాసకులు, భక్తిటీవీ కోటిదీపోత్సవ పురోహితులు రేవల్లి రాజుశర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణ మధ్య శనివార విగ్రహ ప్రతిష్టించారు. ప్రతిష్టాపన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. విగ్రహప్రతిష్టాపన అనంతరం ఎమ్మెల్యే సబితారెడ్డి అమ్మవారిని దర్శించికుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వహకులు మ్మేల్యేకు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో సర్పంచ్ ఆలూరి నరేష్, మాజీ సర్పంచ్ బ్రాహ్మణపల్లి జ్యోతిచంద్రశేఖర్,వార్డు సభ్యులు, నాయకులు మన్నే జయేందర్ ముదిరాజ్, లక్ష్మీనర్సింహరెడ్డి, కాకి రాములు, ఇందిర దేవేందర్, యాలాల శ్రీనివాస్,కాకి నర్సింహ, దామోదర్‌గౌడ్,సామ మహేందర్‌రెడ్డి,ప్రకాష్‌రెడ్డి, కాకి రవిందర్, తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్‌లకు ముగిసిన శిక్షణ కార్యక్రమం





మాడ్గుల, మేజర్ న్యూస్ ( మార్చి 07): గ్రామపంచాయతిల అభివృద్ధి, పంచాయతిరాజ్ చట్టం పై నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లకు అవగాహన కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ లో గత 5రోజులుగా శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం జరిగిందని కొల్కులపల్లి,నర్సాయపల్లి, అప్పారెడ్డిపల్లి గ్రామాల సర్పంచ్ లు భట్టు అనురాధ కిషన్ రెడ్డి, కొత్త జ్యోతిపాండుగౌడ్, కాస సత్యనారాయణలు తెలిపారు.పంచాయతిరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ , స్వర్ణభారత్ ట్రస్ట్ ల ఆధ్వర్యంలో కొనసాగిన శిక్షణకు మాడ్గుల మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్ లు హాజరు కాగా శనివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిధిగా హాజరై జిల్లా అధికారులతో కలిసి శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచ్ లకు గ్రామాల అభివృద్ధి పై దిశా నిర్ధేశం చేసి ధృవపత్రాలు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ శిక్షణ లో మాడ్గుల మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్ లు కల్లు భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి, దుగ్గింపూడి మర్రెడ్డి, ఆమనగంటి భాస్కర్ రెడ్డి, ఆమనగంటి రాధ రమేష్ రెడ్డి, పాలకూర్ల సంతోషరాజుగౌడ్, ముచ్చర్ల ఇదమయ్య గౌడ్, జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నట్లు సర్పంచ్ లు అనురాధకిషన్ రెడ్డి, జ్యోతిపాండు గౌడ్, సత్యనారాయణ లు వివరించారు.

### రాగన్నగూడ సాగర్ హైవే పై కారు బీభత్సం, తప్పిన పెను ప్రమాదం



తుర్కయంజాల్, మేజర్ న్యూస్,( మార్చి 07 ) : :ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని రాగన్నగూడ సాగర్ హైవే పై శనివారం ఓ కారు బీభత్సం సృష్టించింది. ఉదయం 5 గంటల సమయంలో ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్ వెళ్ళే దారిలో క్రెటా కారు అతి వేగంతో దూసుకొచ్చి రాగన్నగూడ గణేష్ టెంపుల్ సమీపంలో ఉన్న విధ్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటన తెల్లవారుజామున కావడంతో ఆ ప్రాంతం నిర్మానుష్యాంగ ఉండటంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. నిద్రమత్తులో ఉన్న కారు నడిపిన వ్యక్తి స్వల్ప గాయాలతో బయట పడి అక్కడ నుంచి వెళ్లి పోయినట్లు స్థానికుల సమాచారం. ఈ ప్రమాదంలో విద్యుత్ స్థంభం విరగడంతో విద్యుత్ తీగలు తెగి కింద పడ్డా విషయం తెలుసుకున్న విధ్యుత్ ,పోలీస్ అధికారులు అప్రమత్తమై నుజ్జు నుజ్జు అయినా కారును, విధ్యుత్ స్థంబాన్ని అక్కడి నుండి తొలగించి వెంటనే చర్యలు తీసుకున్నారు.

# కొందుర్గు సబ్ స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొందుర్గు, మేజర్న్యూస్(మార్చి 07): మండల కేంద్రంలోని కొందుర్గు సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొందుర్గు ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కొందుర్గు, గంగన్నగూడ, చెర్కుపల్లి, జిల్లేడ్-చౌదరిగూడెం మండల పరిధిలోని తూంపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ఆయా గ్రామాల ప్రజలు సహాకరించాలని ఏఈ కోరారు. కొందుర్గు సబ్ స్టేషన్‌లో మెంటనెన్స్ పనులు చేస్తున్నందు వలన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.

# మగువలే.. సారథులు...!

**మొదటిపేజీ తరువాయి...**
కొత్తగా రూపాంతరం చెందాయి. తొలి పీఠంపై ఇద్దరు మహిళలే సారథ్యం వహిస్తున్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సూర్య' దినపత్రిక ప్రత్యేక కథనం..

**పది శాఖల్లో మహిళామణులే..**
రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా కీలకమైన ప్రాంతం. జిల్లాలో కీలక విభాగాలకు చెందిన 10 శాఖలకు మహిళామణులే సారథ్యం వహిస్తున్నారు. వాటిలో కీలకమైన రెవెన్యూసహా వైద్యారోగ్య, వ్యవసాయ వంటి విభాగాలకు మహిళలే అధికారులుగా ఉన్న జిల్లా రంగారెడ్డి గుర్తింపు సాధించింది. భూముల విషయంలో అత్యంత కీలకమైన జిల్లా. రెవెన్యూపరంగా ఎంతో ప్రాముఖ్యం కలిగిన జిల్లాకు డీఆర్వోగా సంగీత వ్యవహరిస్తున్నారు.

**కీలక బాధ్యతల్లో ఉన్న వారు**
జిల్లా రెవెన్యూ అధికారి – సంగీత
సీపీవో –సౌమ్య
జిల్లా వైద్యాధికారి – డాక్టర్ లలితాదేవి
మహిళా సంక్షేమాధికారి, డీఆర్‌డీఏ పీడి – శ్రీలత
జిల్లా వ్యవసాయాధికారి – ఉష
జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడి – పద్మావతి
మత్స్యశాఖ అధికారి – పూర్ణిమ
పౌరసరఫరాల శాఖ అధికారి – వనజాత
జిల్లా పరిశ్రమశాఖ అధికారి – శ్రీలక్ష్మి
ఇన్‌ఛార్జి సమాచార, పౌరసంబంధాల అధికారి బాలేశ్వరి

**తొలి మున్సిపల్ పీఠంపై..**
మున్సిపల్ పోరులో మహిళలు ప్రభంజనం సృష్టించారు. జిల్లాలోని అతివలు ఓట్లలోనే కాదు సీట్లలోనూ అధిక్యతను చాటారు. జనరల్‌కు కేటాయించిన స్థానాల్లో అతివలు తమ ఆదిక్యతను నిరూపించుకున్నారు. చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీలో ఈసారి కొత్తగా రూపాంతరం చెందాయి. చేవెళ్ల మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా దేవర సమత వెంకట్‌రెడ్డి సారథ్యం వహిస్తున్నారు. అలాగే మొయినాబాద్ తొలి పీఠంపై షాబాద్ సోనియా దర్శన్ చైరపర్సన్‌గా పరిపాలన సాగిస్తున్నారు. జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి సారథ్యం వహిస్తున్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



**మొదటిపేజీ తరువాయి...**
జీవులు జీవిస్తున్నాయని, అందులో మానవ జీవితం చాలా ఉత్తమమైందని తెలిపారు. కుటుంబానికి మూలం కుటుంబంలో ఉన్న మహిళా అని, కుటుంబంలోని ప్రతి విషయంలో మహిళ సమతుల్యత కలిగి ఉంటుందని అన్నారు. మనందరికీ అమ్మే మొదటి దైవమని ఆమె మనందరిని ముందుండి నడిపిస్తుందని తెలిపారు. పాత కాలంలో మహిళల పట్ల వివక్షత ఉండేదని, కొన్ని ప్రాంతాల్లో నేటికీ మహిళలను తక్కువగా చూడటం జరుగుచున్నదని, ఇప్పుడిప్పుడే మహిళలకు చదువుపరంగా, ఆర్థికపరమైన విషయాలలో సమానంగా అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. మారుతున్న నేటి కాలంలో అక్షరాస్యత టెక్నాలజీ పెరగడం ద్వారా ఈ వివక్ష తగ్గిందని అన్నారు. అబ్బాయిలను అమ్మాయిలను సమానంగా పెంచాలని, పిల్లలకు విలువలతో కూడిన విషయాలు నేర్పించాలని అన్నారు. కుటుంబం, కుటుంబంలోని బంధాలు, విలువలు మర్చిపోకుండా ఉన్నప్పుడే సమాజాన్ని కాపాడుకోగలమని అన్నారు. మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మహిళలకు అందించే ప్రతిఫలాలను మహిళలు అందిపుచ్చుకునేలా ప్రభుత్వరంగంలో ఉన్న మనందరం కృషి చేయాలన్నారు. జిల్లాలో 1/3 వంతు మహిళా అధికారులు పని చేస్తున్నారని, అందరూ బాగా పని చేస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్లడంలో మహిళా అధికారుల సహకారం ఎంతైన ఉందని తెలిపారు. మహిళలు ఏదైన సాధించగలరని తెలిపారు. అనంతరం జిల్లా అధికారులకు, ఉత్తమ మహిళా సిబ్బందికి, ఆటల పోటీలలో గెలుపొందిన మహళలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, డీఆర్డీఏ పీడి శ్రీలత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పద్మావతి, మత్సశాఖ అధికారి పూర్ణిమ, అడిషనల్ పిడి సుభాషిణి, డీఎంహెచ్‌వో లలిత దేవి, జిల్లా టీజీవోస్ అసోసియేషన్, ప్రెసిడెంట్ డాక్టర్ రామారావు, శాంతి, రేవతి, అలివేలు, మహేశ్వరి, బాలేశ్వరి, రాణి, జ్యోత్స్న, కలెక్టరేట్ మహిళా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత సమాజం బాధ్యత

**మొదటిపేజీ తరువాయి...**
రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, యూనిసెఫ్ చీఫ్ ఫీల్డ్ ఆఫీసర్ జలాలీమ్ బిర్హాను టఫెస్సా, ప్రముఖ సినీ నటుడు సాయి ధరంతేజ్ తదితరులు పాల్గొన్నారు.

**మహిళల పట్ల బాధ్యతాయుత దృక్పథం అవసరం:**
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ,... దేశంలోనే మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో "స్టాండ్ విత్ హర్" కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ప్రతి ఒక్కరూ మహిళల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించే సంస్కృతి సమాజంలో పెరగాలని సూచించారు. మనమందరం మహిళల పట్ల "స్టాండ్ విత్ హర్" అనే భావనతో నిలబడితే రాష్ట్రంలో మహిళలకు సంపూర్ణ భద్రత కల్పించడం సాధ్యమవుతుందన్నారు.

**ఆర్థికాభివృద్ధికి మహిళల పాత్ర కీలకం:**
తెలంగాణ రాష్ట్రం 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే సమాజంలో సగభాగమైన మహిళలకు రక్షణ, విద్య, ఆర్థిక అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా తమ



సీఎం రేవంత్ చేతుల మీదుగా జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

ప్రతిభ, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం ఆకాంక్షించారు.

**అభివృద్ధి చెందిన దేశాలకు మహిళలే బలం:**
ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు వ్యాపారవేత్తలు, శాస్త్రవేత్తలు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజనీర్లుగా రాణించడం వల్లే ఆ దేశాలు ఆర్థికంగా ముందుకు వచ్చాయని ఆయన అన్నారు. మహిళల రక్షణ కోసం కేవలం చట్టాలు లేదా పోలీస్ పహారా సరిపోదని, సమాజం మొత్తం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఎవరికైనా అన్యాయం జరిగినప్పుడు చూసి చూడనట్లు ఉండటం కూడా నేరాన్ని ప్రోత్సహించినట్లేనన్నారు.

**మహిళల సాధికారతకు ప్రభుత్వం చర్యలు:**
రాష్ట్రంలో మహిళల సాధికారత కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరుతోనే ఇస్తున్నామని, స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తూ శిల్పారామం వద్ద దుకాణ సముదాయాలను కేటాయించామని పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించి మహిళలు పెద్ద పరిశ్రమలతో పోటీ పడేలా అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.

**ఉపాధి అవకాశాలతో మహిళలకు ప్రోత్సాహం:**
మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు వెయ్యి బస్సులకు మహిళలను యజమానులుగా చేశామని తెలిపారు. అలాగే పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయించి మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకుంటునామని చెప్పారు. మహిళా యూనివర్సిటీకి వీరనారి



పాల్గొన్న పోలీస్ శాఖ అధికారులు

చాకలి ఐలమ్మ పేరు పెట్టడం ద్వారా మహిళా శక్తికి గౌరవం చాటామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలోనే మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో "స్టాండ్ విత్ హర్" కార్యక్రమాన్ని చేపట్టామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనాన్ని అందించాలి



చిగురాల్ పల్లిలో అంగన్వాడీ కేంద్రంను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**మొదటిపేజీ తరువాయి...**
జాగ్రత్తలకై సూచనలు చేయాలని ఆయన అధికారులు సూచించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో , పాఠశాలల్లో, అంగన్వాడి కేంద్రాల్లో రోజువారి మెనూకు సంబంధించిన చార్ట్ ను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆయన అధికారులను ఆదేశించారు. విద్యార్థినీ, విద్యార్థులకు అత్యవసర సమయంలో ఉపయోగపడే సిపిఆర్ పై అవగాహన



కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా భోజన శాల, వంటగది, స్టోర్ రూమ్ లను పరిశీలించారు. అనంతరం చిగురాల్ పల్లి, గోవిందాపూర్ లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహించిన సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. 99 రోజులపాటు నిర్వహించే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. అధికారులే గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నందున తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధుల సహకారం, ప్రజల భాగస్వామ్యంతో సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళను త్వరితగతిన నిర్మాణ పనులను చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికీ గ్రౌండింగ్ కానీ ఇందిరమ్మ ఇళ్లకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందించి వారిని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. అనంతరం పరిగి తహసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నిర్మాణాల్లో ఉన్న వివిధ భవనాల పనులను వేగవంతం చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో, అంగన్వాడి కేంద్రాల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం కచ్చితంగా భోజనాన్ని అందివ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

జిల్లా కలెక్టర్ పర్యటనలో డిటిడబ్ల్యూఓ కమలాకర్ రెడ్డి, డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, డిపిఓ జయసుధ, తహసిల్దార్ వెంకటేశ్వరి, ఎంపీడీవో హరి ప్రియ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, చైర్ పర్సన్ కుడుముల రజిత, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా సుజాత, ఐసిడిఎస్ సూపర్వైజర్ సింధు, సర్పంచులు ఆయేషా బేగం, హరి చందర్ లు పాల్గొన్నారు.

## కిలోన్నర గంజాయితో యువకుడు అరెస్ట్

- **వాహనాల తనిఖీలో పట్టుబడిన నిందితుడు.. కారు స్వాధీనం**

**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (మార్చి 07) :** గుట్టు చప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ జూపల్లి రవి తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం అర్ధరాత్రి యంనంపేట్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా వస్తున్న టీఎస్ 08 ఎం 2081 నంబర్ గల మారుతి బలెనో కారును ఆపి తనిఖీ చేశారు. తనిఖీలో కారులో సుమారు కిలోన్నర గంజాయిని 30 ప్యాకెట్లుగా ప్యాక్ చేసి ఉంచినట్లు గుర్తించారు. కారును నడుపుతున్న యంనంపేట్‌కు చెందిన మొగుల్లపల్లి శివసాయిరెడ్డి (27)ను అదుపులోకి తీసుకుని విచారించగా, కర్నాటక రాష్ట్రంలోని బీదర్‌కు చెందిన అబ్బాస్ అలీ నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి రాంపల్లి, యంనంపేట్ తదితర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి కిలోన్నర గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ



కేసులో బీదర్‌కు చెందిన అబ్బాస్ అలీ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

▶▶ షాద్ నగర్ అడిషనల్ డిస్టిక్ట్ జడ్జ్ స్వాతి రెడ్డి ▶▶ మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డిని సన్మానించిన వాకర్స్ అసోసియేషన్





షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (మార్చి 07):మహిళలు తమ హక్కులను పరిపూర్ణంగా వినియోగించుకుని అన్ని రంగాల్లో రాణించాలని షాద్ నగర్ అడిషనల్ డిస్టిక్ జడ్జ్ స్వాతి రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక మున్సిపాలిటీలోని పారిశుద్ధ మహిళా కార్మికులను పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ గ్రౌండ్ వాకర్స్, యోగా సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో బాగంగా పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో పారిశుద్ధమహళా కార్మికులకు మధ్యాహ్న భోజన టిఫిన్ బాక్స్, టవల్స్ అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డిస్టిక్ జడ్జ్ స్వాతి రెడ్డి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సాహితీలు హాజరై పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి స్వాతి రెడ్డి మాట్లాడుతూ లింగ వివక్ష లేకుండా తల్లి తన పిల్లలపై సమాన ప్రేమ చూపుతూ పెంచి పెద్ద చేయాలని సూచించారు. అలాగే వారు భావి భారత పౌరులుగా ఎదిగేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. మహిళలు తమ హక్కులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జడ్జ్ స్వాతి రెడ్డి వాకర్, యోగా సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం షాద్ నగర్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి సాహితి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా సామాజికంగా అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా సమాజంలో జరిగే మంచి కార్యక్రమంలో పాల్గొని తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని వాకర్స్ అసోషియేషన్ సభ్యులు పట్టణ మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొని ఘనంగా సత్కరించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలి

★ బీఆర్ఎస్ యువజన విభాగం మండల అద్యక్షుడు వనపర్తి భద్రినాథ్ గుప్తా



మంచాల, మేజర్ న్యూస్ (మార్చి 07) : రాష్ట్రంలోని రైతులకు ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేసి ఖాతాలో జమ చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం మండల అద్యక్షుడు వనపర్తి భద్రినాథ్ గుప్తా డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకంపై గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ ఆచరణలో మాత్రం విఫలమైందన్నారు. రైతులకు ఖాతాలో రైతు భరోసా నిధులు జమ కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన ఓ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలు పూర్తయ్యాక వెంటనే రైతు భరోసా నిధులు జమ చేస్తామని ప్రకటించినా.. ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. క్యాబినేట్ సమావేశంలోనూ ఆ ప్రస్తావన లేదని తెలిపారు. రైతు కన్నీళ్లతో పునాదులు నిర్మించుకున్న ఏ ప్రభుత్వము మనుగడ సాగించినట్లు చరిత్రలో లేదన్నారు. ఎన్నికల ముందు ఎకరానికి రూ. 15వేలు ఇస్తామని చెప్పినా, ఇప్పటికీ రెండు సీజన్ల రైతు భరోసాకు ఎగనామం పెట్టారని ఆరోపించారు. రైతులకు సకాలంలో రైతు భరోసా ఇవ్వడానికి నిధులు లేవంటున్న రేవంత్ రెడ్డికి మూసీ సుందరీకరణకు, ఫోర్త్ సిటీ పేరుతో భూసేకరణకు రూ. వేల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. పంట పెట్టుబడి సాయం అందక రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగులమందుల కొనుగోలుకు ప్రయివేట్ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోందని, కొందరు రైతులు అధిక వడ్డీకి అప్పులు తెచ్చి తిప్పలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేయాలని లేనియెడల రైతులతో కలిసి ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

▶▶ మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్‌రెడ్డి ▶▶ నేడు మున్సిపల్ కార్యాలయంలో మహిళా దినోత్సవం




చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి07)ః పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్‌రెడ్డి అన్నారు. 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 1,2వార్డులలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశం, ప్రత్యేకాధికారి విశాల్‌రాజ్‌తో కలిసి పర్యటించి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయా కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.... పరిశుభ్రమైన పట్టణం కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని సూచించారు. తడి,పొడి చెత్తను వేరువేరుగా చేసి మున్సిపల్ చెత్త బండిలో వేయాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మెన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగిరెడ్డి, సువర్ణచందు, దూత మల్లేష్, మద్దెల శ్రీనివాస్, ప్రజలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు మున్సిపల్ కార్యాలయంలో మహిళా దినోత్సవం

చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం, డా.పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు. అదేవిధంగా మహిళా పారిశుద్ధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.

# ఆర్డీవోను కలిసిన మున్సిపల్ వైస్ చైర్మెన్



చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి07)ః చేవెళ్ల ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన పార్థసింహారెడ్డిని చేవెళ్ల మున్సిపల్ వైస్ చైర్మెన్ కాసుల రాముగౌడ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.... రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అధికారులకు నాయకులు సహాయ,సహకారాలు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం ఏవో రాజశేఖర్, వార్డు ప్రజలు తదితరులు ఉన్నారు.

# మున్సిపాల్ వార్డుల్లో ప్రజా పాలన..ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు

▶▶ పారుశుధ్య పనులు చేపట్టిన కౌన్సిలర్లు... ▶▶ కార్మికులతో కలిసి చెత్త ఊడ్చిన నేతలు...
▶▶ పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత... ▶▶ షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ బస్వం, వైస్ చైర్మన్ మోహన్..

ఫరూఖ్‌నగర్,మేజర్‌న్యూస్(మార్చి 07): ప్రభుత్వం అత్యంత ప్రతిస్టాత్మకంగా చేపటడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు షాద్‌నగర్ మున్సిపాలిటీలోని వార్డుల్లో శనివారం చైర్మన్, వైస్ చైర్మన్‌లు ప్రారంభించారు. ఈసంధర్భంగా చైర్మన్ బస్వం, వైస్ చైర్మన్ అందె మోహన్‌లు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డు పరిధిలోని వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. కార్మికులతో కసని వీధుల్లోని రోడ్లను ఊడ్చి చెత్తను ఎత్తారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అని అన్నారు. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం 99రోజుల పాటు సాగుతుందని, దశల వారిగా అభివృద్ధి పనులు చేపడదామని వివరించారు.




14వార్డులో ...


14వవార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వీధుల్లో రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. వార్డులో అన్ని మౌలిక వసతులను కల్పించి వార్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రజలు తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన సదవకాశంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి అర్హులందరికి ప్రభుత్వ పథకాలను అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీతరెడ్డి, వార్డు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను కలిసిన చేవెళ్ల బీఆర్ఎస్ నాయకులు



చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి07)ః బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి చేవెళ్ల బీఆర్ఎస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.... బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని,కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. వారిని కలిసిన వారిలో డీసీఎంఎస్ మాజీ చైర్మెన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్, కమ్మెట మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, నాయకులు గోనె కరుణాకర్‌రెడ్డి, చాకలి కృష్ణ, తలారి యాదయ్య తదితరులు ఉన్నారు.

## పాంబండ ఆలయ బ్రహ్మోత్సవాల కమిటీ చైర్మన్‌గా కోట్ల మహిపాల్ రెడ్డి



**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (మార్చి 07):** కుల్కచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండశ్రీ రామలింగరేశ్వర స్వామి జాతర సందర్భంగా దేవాదాయ శాఖ ఉత్సవ కమిటీని నియమించింది. శనివారం దేవాలయం అవరణం ఈవో బాలనర్సయ్య విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవ కమిటీని ప్రకటించారు. జాతర ఉత్సవ కమిటీ సభ్యులు మైపాల్ రెడ్డి, చిన్న నర్సింలు, ప్రభాకర్, లక్ష్మి , అంజిలయ్య , నర్సింలు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, సర్పంచ్ శ్రీనయ్య, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, అర్చకులు పాండు శర్మ , గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

## నాగారం ఉన్నత పాఠశాలలో ఘనంగా మహిళా దినోత్సవం




**కీసర,మేజర్ న్యూస్,(మార్చి 07):** నాగారం ఉన్నత ప్రభుత్వ పాఠశాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గౌరవప్రదంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సి రాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంకు ముఖ్య అతిథిగా డాక్టర్ శారద విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను మరియు ఇంటరాక్షన్ గర్ల్స్ స్టూడెంట్స్ విత్ రోల్ మోడల్స్ లో భాగంగా బాలికల, మహిళల ఆరోగ్య సంరక్షణ, నెలసరి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, టీనేజీ వయసు ఆకర్షణ, ఆకర్షణకి లోనైతే వచ్చే పరిణామాలు, ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పిల్లలకు అర్థం అయ్యే రీతిలో చక్కగా వివరించారు. ఆడ పిల్లలు తమ హక్కుల కోసం ప్రశ్నించాలని, భవిష్యత్తులో ఆర్థిక స్వాతంత్ర్య ము సంపాదించాలని దానికి విద్య, నైపుణ్యం చాలా అవసరమన్నారు. ఆరోగ్యం గురించి ఆలోచించి ప్రభుత్వం రాగి జావా, వారానికి మూడు సార్లు మధ్యాహ్న భోజనం లో కోడి గుడ్లను అందిస్తున్నది. వాటిని ఉపయోగించుసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సి రాములు మాట్లాడుతూ ఇంట్లో, పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు, బాలికలకు సముచిత స్థానం, గౌరవం, బాధ్యత ఇచ్చి మహిళా సాధికారత కల్పించాలనే సంకల్పం తో పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంకు పాఠశాల ఇంచార్జ్ ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మహిళా ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.


## వశిష్ట పాఠశాలలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**యాలాల మేజర్ న్యూస్: (మార్చి 8)** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యాలాల మండలంలోని లక్ష్మీనారాయణ పూర్తి చౌరస్తా అగ్గనూరు రోడ్డు మార్గంలో శ్రీ వశిష్ట పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి మహిళల పాత్ర,వారి సాధికారతపై ఉపాధ్యాయులు విద్యార్థులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ,ఉపాధ్యాయులు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని,ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని తెలిపారు.విద్యార్థులు మహిళల గౌరవాన్ని కాపాడుతూ సమాన హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.కార్యక్రమంలో విద్యార్థినులు ప్రసంగాలు,పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు.అనంతరం మహిళా ఉపాధ్యాయులను పూలమాలలు వేసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రిజ్వానా ఇన్‌చార్జ్ రాధిక కరస్పాండెంట్ హరి కృష్ణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు

# నేటి నుండి శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


ఆలయంలో కొలువైన శివుడు


ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం


ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరు

**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (మార్చి 07):** కుల్కచర్ల మండల పరిధిలోని బండవెల్కి చర్ల గ్రామ సమీపంలో కొలువై ఉన్న పాంబండ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం మహిమాన్విత క్షేత్రంగా ఏకశిలా పర్వతంగా వెలుగొందుతున్నది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కోర్కెలు తీర్చే స్వామిగా భక్తుల పూజలందు కుంటున్నాడు. ఈ స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి మార్చి 19వ తేదీ వరకు జరుపనున్నారు. ఉత్సవాలు నిర్వహించేందుకు దేవాలయ కమిటీ సభ్యులు, అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రతి సంవత్సరం ఉగాదికి నిర్వహించే రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు లక్షల సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుంటారు. ప్రతి సంవత్సరం రెండు పర్యాయాలు ఈ బ్రహ్మో త్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. శ్రావణమాసం చివరి సోమవారం మూడు రోజులు, ఉగాదికి ముందు 12రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుపుతారు. కుల్కచర్ల గ్రామం నుంచి పాంబండ దేవాలయానికి 2 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది.

**ఆలయ విశిష్టత**

బండవెల్కిచర్ల సమీపంలో ఉన్న పాంబండ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి ఘనీయమైన చరిత్ర ఉంది. సుమారు కిలోమీటర్ వరకు కుల్కచర్ల నుంచి పాంబండ వరకు రాతిబండ ఉంది. ఈ బండ పాములా వంకరలు తిరిగి ఉంది. దేవాలయ వెనుక భాగం పాము నాలుకలా కనిపిస్తుంది.గతంలో పాము బండమధ్యలో నుంచి వెళ్లడం వల్ల బండ రెండుగా చీలిపోయిందని పలువురు పేర్కొంటున్నారు. పాము రాతిగా మారిందని అందువల్ల ఈ బండకు పాముబండ అని కాలక్రమేనా పాంబండగా రూపాంతరం చెందిందని పూరాణాలు చెబుతున్నాయి. ఈ బండను పాంబండ ఏకశిలా పర్వతంగా కూడా ప్రస్తుతం పిలుస్తున్నారు. త్రేతాయుగంలో సీతను ఎత్తికెళ్లిన రావణుడిని సంహరించిన రాముడు హత్యాపాప విమోచనం కోసం కోటి లింగాలను స్థాపించాలని బ్రహ్మర్షులు శ్రీరామునికి సూచిస్తారు. దీంతో రాముడు కోటి లింగాల స్థాపించడానికి పూనుకుంటాడు. అందులో భాగంగానే వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం పాంబండపైన రాముడు స్వయంగా లింగాన్ని ప్రతిష్ఠించి,పూజ చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి. రాముడు పాంబండపై కొన్నాళ్లు గడిపాడని,నిత్యం శివుడికి పూజ చేసే రాముడు లింగమూర్తిని స్వయంగా ప్రతిష్ఠించి,పూజలు చేశారని పూరాణాల్లో చెబుతున్నారు.

**గుండం(కోనేరు) విశిష్టత**

పాంబండపై ఉన్న గుండంలో నీటికి చాలా ప్రాముఖ్యత ఉన్నది. భక్తులు సైతం గుండం నీటిని విశిష్ఠతగలదిగా విశ్వసిస్థారు. అంతపెద్ద బండ మధ్యలో వెలసిన ఈ కోనెరులో ఎల్లప్పుడూ నీరు పుష్కలంగా ఉంటుంది. శ్రీరాముడు స్వయంగా లింగాన్ని ప్రతిష్ఠించినప్పుడు లింగాన్ని అబిషేకించడానికి నీరు అవసరమైన సమయంలో తన బాణంతో బండపై గుండాన్ని సృష్ఠించి ఆ నీటితో అబిశేకం చేశారని పురాణాలు చెప్తున్నాయి. అందుకే ఈ గుండం ఎప్పుడూ ఎండిపోదు. ఈ గుండంలో స్నానం చేస్తే దీర్ఘకాలిక వ్యాదులు నయం అవుతాయని పోలాల్లో, పశువులపై, ఇళ్ళపై ఈ నీటిని చల్లడం వల్ల ఎలాంటి అరిష్ఠాలైనా తొలగిపోతాయని ప్రజల నమ్మకం

**ప్రతి ఏడాది పెరుగుతున్న పుట్టులింగం**

బండ వెనుకభాగంలో పుట్టులింగం గుడి ఉండగా, ఈ పుట్టులింగం ప్రతి ఏడాది కొంచెం కొంచెం పెరుగుతుందని భక్తుల విశ్వాసం. ఆలయం పక్కనే భ్రమరాంబదేవీ, ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. ఆలయం ముందుభాగంలో నవగ్రహాలను ప్రతిష్ఠించారు. శకటోత్సవం, రథోత్సవం, అగ్నిగుండాలు, వివిధ రకాల సేవలు స్వామి వారికి వైభవంగా జరుపుతారు. గతంలో రామప్ప అనే ముని అక్కడే తపస్సు చేసి అక్కడే సమాధి అయ్యారని పెద్దలు చెబుతారు. ఆయన సమాధి కూడా ఉంది. ప్రతి పౌర్ణమికి అన్నదానం చేస్తారు. పాంబండపై ఉన్న గుండానికి చాలా విశిష్టత ఉంది.శ్రీ రాముడు ప్రతిష్టించిన శివలింగానికి అభిషేకం చేయడానికి నీటికోసం బండపై బాణాన్ని సంధించి ఆ నీటితో అభిషేకించేవాడని, ఇందులో నీరు ఏకకాలంలో నైనా నిండుగా ఉంటుంది. చుట్టుపక్కల గ్రామాల వారు గుండం నీటిని తమ పొలాల్లో చల్లుకుంటారు. పరిగి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే బస్సులు,కోస్గి నుంచి కుల్కచర్ల మీదుగా షాద్‌నగర్ వెళ్లే బస్సుల్లో బ్రహ్మోత్సవాలకు భక్తులు చేరుకోవచ్చు.

**బ్రహ్మోత్సవాల పూజా కార్యక్రమాలు...**

ఈ నెల 8న ఉత్సవమూర్తిని ఆలయ అర్చకుల ఇంటి నుంచి పాంబండపైకి తీసుకురావడంతో వేడుకలు ప్రారంభం అవుతాయి. గణపతి హోమం, ద్వకారోపాజ- పుణ్యాహవాచనం, కలశాస్థావన, స్వామివారిని ఆలయానికి తీసుకువచ్చుట, పల్లకి సేవ చేస్తారు. 9న రుద్రహోమం, సాయంత్రం పల్లకి సేవ, 10న శాకటోత్సవం పల్లకి సేవ హారతి, 11న పల్లకీసేవ, హారతి 12న పల్లకీసేవ 13న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, సాయంత్రం పల్లకీసేవ 14న తెల్లవారుజామున రథోత్సవం, సర్వదర్శనం, సాయంత్రం పల్లకీసేవ. 15. 16. 17న సర్వదర్శ సాయంత్రం పల్లకీసేవ, 18న తెల్లవారు జమున అగ్నిగుండాలు, అమావాస్యను పురస్కరం

చుకుని ప్రత్యేక పూజలు. 19న ఉగాది సందర్భంగా పచ్చడి పంపిణీ పంచాంగ శ్రవణంతో ఉగాది బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

**భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు పూర్తి..**
**-ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి**



శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

**బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం..**
**-ఆలయ కార్యనిర్వాహక అధికారి బాల నర్సయ్య**



శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో రెండు పర్యాయాలు జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. భక్తులకు ఎలాంటి అసౌకార్యాలకు గురి కాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ అంజిలయ్య, ఉప సర్పంచ్ లాల్ బహదూర్ శాస్త్రి
- పుట్టపహాడ్ లో హోమియోపతి వైద్య శిబిరం



**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (మార్చి 07):** గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అంజిలయ్య,ఉప సర్పంచ్ లాల్ బహదూర్ శాస్త్రి అన్నారు. శనివారం కుల్కచర్ల మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామంలో హైదరాబాద్ కు చెందిన ఔషధి హోమియోపతి క్లినిక్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు సాయి కీర్తి, నవిత పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించే విధంగా సహకరించాలి

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన గ్రామ పంచాయతీ పాలకవర్గం



కందుకూరు, మేజర్‌న్యూస్( మార్చి 07):గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించే విధంగా కృషి చేయాలని సహకరించాలని కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని పంచాయతీ పాలకవర్గం కోరారు. శనివారం బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కందుకూరు మండలం దెబ్బడగూడ గ్రామ పంచాయతి నూతన పాలకవర్గం మంత్రిని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభివృద్ధికి నిధులు కోరారు. గ్రామంలో బొడ్రాయి నుండి దెబ్బడగూడ గేట్ వరకు, మహమద్‌నగర్ నుండి శ్రీశైలం జాతీయ రహదారి వరకు, దెబ్బడగూడ నుండి ముచ్చర్ల వరకు రెండు వరుసల రహదారికై 'వికసిత్ భారత్ జీ రామ్‌జీ' పథకం ద్వారా 24 కోట్ల నిధులు మంజూరు అయ్యే విధంగా సహకరించాలని వారు కోరారు. ఈసందర్భంగా మంత్రి స్పందిస్తూ గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొంతం జంగారెడ్డి, కళ్లెం కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ చెంచు అంజమ్మ,వార్డు సభ్యులు సామల దయాకర్‌రెడ్డి, మోటె జంగయ్య, పెరుమల్ల శేఖర్, దేరంగుల శ్రీరాములు, గుప్తల శారద నర్సింహ, నాయకులు బండ నర్సింహ,మండల దయాకర్,బొడ్డు మహేందర్‌రెడ్డి,చెంచు అనిల్,ద్యారంగుల రామకృష్ణ, చిందం అనిల్, దేరంగుల రమేష్, వరికుప్పల గణేష్, వరికుప్పల శ్రీకాంత్,బడుక నరేష్, అక్కెనపల్లి సునిల్, మండల రజినీకాంత్, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళాలు అన్ని రంగాల్లో రాణించాలి : సబితాఇంద్రారెడ్డి






మహేశ్వరం,మేజర్‌న్యూస్(మార్చి 7): మహిళాలు అన్నిరంగాల్లో రాణించాలని మాజీ మంత్రి,ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అవేర్ సంస్థ మాధవ్‌జీ కాలేజ్‌లో ప్రిన్సిపల్ డాక్టర్ హనుమంత్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని అన్నారు. ఉన్నత విద్యాను అభ్యసించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరారు. అంతకు ముందు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న ర్సింగ్ ప్రిన్సిపల్ నీలిమా, బిపిటి ప్రిన్సిపల్ నీలిమి లెక్చరర్లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏరులై పారుతున్న డ్రైనేజీ నీరు దుర్వాసనతో హైదర్ షాకోట్ డివిజన్ వీధులు

## రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్ఎంసి కార్యాలయంలో పత్తాలేని శానిటేషన్ ఏ ఈ, డిఇ అధికారులు



గండిపేట్ మేజర్ న్యూస్ (మార్చ్ 07) హైదర్ షాకోట్ డివిజన్ పరిధిలోని ఏ వీధిలో చూసిన ఏరులైపాడుతున్న మురుగునీరు. డ్రైనేజీ సమస్యలు పరిష్కరించవలసిన అధికారులు నిద్రమత్తులో ఉన్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. హైదర్ షాకోట్ డివిజన్ పరిధిలోని బీజాపూర్ జాతీయ రహదారి రిలయన్స్ మార్ట్ వద్ద. హిమగిరి నగర్, మాధవి నగర్ కాలనీలలో వారం రోజుల నుండి డ్రైనేజీ నీరు ఏరులై పారుతుందని జిహెచ్ఎంసి శానిటేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని గొప్పలు చెప్పుకునే అధికారులకు జాతీయ రహదారిపై డ్రైనేజీ నీరు పొంగిపొర్లు తింటే కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు? డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయానికి ఎన్నిసార్లు వెళ్లిన శానిటేషన్ విభాగం ఏఈ, డిఇ అందుబాటులోనే ఉండడం లేదన్నారు. ఆ అధికారుల ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయని ధ్వజమెత్తారు. డ్రైనేజీ పైప్ లైన్లను శుభ్రం చేయడానికి సావిత్రి అనే సూపర్వైజర్ ఫోన్ నెంబర్ ఇచ్చారని ఆమెకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ నుండి జిహెచ్ఎంసి లోకి విలీనం అయిన తర్వాత శానిటేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అసహనం వ్యక్తం చేశారు. ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి పరిసరాలపై దృష్టి సారించి హైదర్ షాకోట్ డివిజన్ పరిధిలోని వీధుల్లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.





# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత : ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి



కందుకూరు, మేజర్‌న్యూస్( మార్చి 07): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కందుకూరు రెవెన్యూ డివిజన్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ప్రాంగణాన్ని శుభ్రపరిచి నిరుపయోగం ఉన్న గదులను ఉపయోగంలోకి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్, ఎంపీడీవో బి.సరిత, సీఐ వెంకటేశ్వర్లు, ఎంపీవో గీత, మెడికల్ అధికారి హుమేరా సుల్తానా, సర్పంచ్ సరికొండ పాండు, పంచాయతీ కార్యదర్శి సురేందర్ గౌడ్, మెడికల్ సిబ్బంది, ఏఎన్ఎంలు,ఆశాలు పాల్గొన్నారు.

# విద్యార్థినీలు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**-స్కూల్ కరస్పాండెంట్ శశిపాల్‌రెడ్డి**



చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి07)ః విద్యార్థినీలు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సంస్కృతి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ అత్తెల్లి శశిపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ రెహానా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సంస్కృతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... మహిళలు స్వయం కృషితో ఏ రంగాలోనైన రాణించాలని సూచించారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. విద్యార్థినీలు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అంతకుముందు విద్యార్థినీలు స్వాతంత్ర్య సమరయోదులు, శాస్త్రవేత్తలు, సంఘసంస్కర్తలు, డాక్టర్లు, రాజకీయ నేతల వేషాధారణతో ఆకట్టుకున్నారు. ఈకార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి07)ః విద్యుత్ సరఫరా వ్యవస్థ మెరుగుదల కోసం నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయ ఉంటుందని విద్యుత్ ఏఈ రాజేందర్ తెలిపారు. కందవాడ లైన్‌పై నిర్వాహణ పనుల కారణంగా ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు 33/11కేవీ కందవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, చేవెళ్ల సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే 11కేవీ మిన్‌పూల్ పీడర్‌పై రోడ్డు నిర్వాహణ, రోడ్డు విస్తరణ పనుల కారణంగా సంబంధిత ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

# మహిళలు పౌల్ట్రీ రంగాల్లో రాణించాలి

**-మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్‌రెడ్డి**




చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి07)ః ఇండియాన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్విహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్‌రెడి, 15వ వార్డు కౌన్సిలర్, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.... మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. పౌల్ట్రీ రంగాల్లో రాణించాలన్నారు. ఈకార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా వెళ్లడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ సతీమణి గడ్డం గీతారంజిత్‌రెడ్డి, ఐపీఈఎంఏ ప్రెసిడెంట్ ఉదయ్‌సింగ్ బయస్, మహిళలు పాల్గొన్నారు.

## అంత్యక్రియల కోసం యువ నేత ముబారఖ్ అలీ ఆర్థిక సహాయం..



ఫరూఖ్‌నగర్,మేజర్‌న్యూస్(మార్చి 07):మహిళ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం 13వ వార్డు కాంగ్రెస్ యువ నేత ముబారఖ్‌అలీఖాన్ 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వార్డులో శనివారం పసుపుల యాదయ్య అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని బౌతికాయాన్ని సందర్శించి నివాళ్లర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబానికి అండగ ఉంటానని బరోసా ఇచ్చారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతమే లక్ష్యం

▸▸ డీఎంహెచ్ఓ డా. ఉమా గౌరి ▸▸ హెల్త్ మిషన్-99 కింద ఐపిహెచ్ఎస్ ప్రమాణాల అమలుకు వైద్య సిబ్బందికి శిక్షణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్ (మార్చి 07):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో హెల్త్ మిషన్ 99 కార్యక్రమం కింద ఐపిహెచ్ఎస్ (ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్) ప్రమాణాలు మరియు ఓపెన్ డేటా కిట్ టూల్‌కిట్ పై ఫిజికల్ శిక్షణ కార్యక్రమం శనివారం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ లోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, మధ్యస్థాయి ఆరోగ్య సేవా ప్రదాతలు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆరోగ్య సంస్థలను ఐపిహెచ్ఎస్ ప్రమాణాలకు అనుగుణంగా బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యమని డా. ఉమా గౌరి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల నాణ్యతను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. హెల్త్ ఫెసిలిటీలు మరియు హాస్పిటల్లను బలోపేతం చేయడానికి నాలుగు దశల్లో కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి దశ మార్చి 6 నుండి 31 వరకు అంతర్గత మూల్యాంకనం మరియు లోపాల గుర్తింపు చేపట్టనున్నారు. రెండవ దశ ఏప్రిల్ 1 నుండి 15 వరకు జిల్లా స్థాయి నాణ్యత బృందాల ద్వారా ధృవీకరణ, పరిశీలన నిర్వహించనున్నారు.


కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న డిఎంఎచ్ఓ డా. ఉమాగౌరి

అదేవిధంగా మూడవ దశ ఏప్రిల్ 16 నుండి 30 వరకు పనితీరు మెరుగుదల చర్యలు చేపట్టనున్నారు. నాలుగవ దశ మే 1 నుండి జూన్ 12 వరకు లోపాల నివారణ మరియు పునఃమూల్యాంకనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి దశలో చేపట్టే కార్యక్రమాలను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరి నాయకత్వంలో జిల్లా నాణ్యత బృందం పర్యవేక్షించనుంది. ఈ శిక్షణ కార్యక్రమంలో నాణ్యత నిర్వహణ అధికారి సురేష్ శిక్షణ అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. లావణ్య, ప్రోగ్రాం అధికారి డా. కౌశిక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ వసంత తదితరులు పాల్గొన్నారు.

# అలియాబాద్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

▸▸ రూ. 7.5 లక్షలతో సీసీ రోడ్డ పనులకు శ్రీకారం ▸▸ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి


సిసి రోడ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కంఠం శిరీష కృష్ణారెడ్డి

**శామీర్‌పేట్, మేజర్ న్యూస్ (మార్చి 07):** అలియాబాద్ మున్సిపాలిటీని దశలవారీగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని అలియాబాద్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. శనివారం అలియాబాద్ పురపాలక సంఘం పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట 5వ వార్డులో వైస్ చైర్మన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డితో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి సుమారు రూ. 7.5 లక్షల వ్యయంతో లాల్‌గడి మలక్‌పేట 5వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ కె. చంద్రశేఖర్, 6వ వార్డు కౌన్సిలర్ కైరా గణేష్, 7వ వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేష్, 14వ వార్డు కౌన్సిలర్ తలారి స్వప్నబాబు, 19వ వార్డు కౌన్సిలర్ గుర్మ కుమార్ యాదవ్, ఏఈఈ సనా షాహిని, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాంపల్లిదాయరలో నేడు సీఎంఆర్ ట్రోఫీ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

▸▸ కేటీఆర్ హాజరు ▸▸ మల్లారెడ్డి దంపతుల గోల్డెన్ జూబ్లీ సందర్భంగా సీఎంఆర్ ట్రోఫీ పోటీలు ▸▸ విజేత జట్టుకు రూ.1 లక్ష.. రన్నర్‌కు రూ.50 వేల నగదు బహుమతి ▸▸ కందాడి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ


సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మల్లా రెడ్డి, బీఆర్ఎస్ నేతలు

**కీసర,మేజర్ న్యూస్ (మార్చి 7):** కీసర మండలం రాంపల్లిదాయర గ్రామ సమీపంలో నేడు (ఆదివారం) సీఎంఆర్ ట్రోఫీ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి -- కల్పన దంపతుల 50వ వివాహ వార్షికోత్సవం (గోల్డెన్ జూబ్లీ) సందర్భంగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మేడ్చల్ మల్కాజిగిరి నియోజకవర్గానికి చెందిన కందాడి శ్రీకాంత్ రెడ్డి శనివారం తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. నేడు ఉదయం 08.30 గంటలకు రాంపల్లిదాయరలోని 'స్టేప్స్' క్రికెట్ స్టేడియం వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించనున్నట్లు కందాడి శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ. 1,00,000 నగదు బహుమతి, రన్నర్ జట్టుకు రూ. 50,000 నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి జట్టు 10 ఓవర్ల మ్యాచ్‌లు ఆడే విధంగా నాకౌట్ పద్ధతిలో ఎంట్రీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఒక ఆటగాడు ఒక్క జట్టులో మాత్రమే ఆడేందుకు అనుమతి ఉంటుందని, అంపైర్ నిర్ణయం తుది






బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కందాడి శ్రీకాంత్ రెడ్డి

నిర్ణయంగా పరిగణించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. నేడు ఉదయం 9 గంటల నుంచి రాంపల్లిదాయర విలేజ్ సమీపంలో పోటీలు ప్రారంభమవుతాయని, మ్యాచ్‌లకు వ్యాఖ్యానం (కామెంటరీ)తో పాటు లైవ్ స్ట్రీమింగ్ కూడా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్టేడియం వద్ద ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి నియోజకవర్గ నేతలు, వివిధ మండలాల నాయకులతో కలిసి సన్నాహక సమావేశం కూడా నిర్వహించినట్లు కందాడి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

## వైభవంగా శ్రీ అభయాంజనేయస్వామి జాతర



**కొడంగల్, మేజర్ న్యూస్ (మార్చి 7):** కొడంగల్ మండల పరిధిలోని సంగాయిపల్లి గ్రామంలో స్వయం భూ శ్రీ అభయాంజనేయస్వామి జాతర ఉత్సవాలను ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో మొదటి రోజు అర్చకులు విజయకృష్ణ, సభాపతి రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకం, సింధూర లేపనం, పుష్పార్చన అలంకరణ, నైవేద్యం, మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ, పల్లకి సేవ అనంతరం భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు. సంగాయిపల్లి గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో రోజు ఆదివారం పెరుగు బసంతం, దీపోత్సవము, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

## గ్యాస్‌ను పొదుపుగా వాడుకోవాలి

▸▸ శ్రీదత్తా సాయి హెచ్.పీ గ్యాస్ డీలర్ జి.విష్ణువర్ధన్ రెడ్డి



**దోమ, మేజర్ న్యూస్ (మార్చి 07):** దోమ మండల ప్రజలు గ్యాస్ ను పొదుపుగా వాడుకోవాలని శ్రీదత్తా సాయి ఏచ్ పి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు జి.విష్ణువర్ధన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం, దానికి ప్రతీకగా ఆ దేశం చేస్తున్న ప్రతిదాడులు భారత్ పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అంతా ఊహించినట్లుగానే గ్యాస్ ధరల ప్రారంభమైందిఅన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత యుద్ధ రాజకీయ పరిస్థితుల దృష్ట్యా, అత్యవసర కార్యాచరణ,నిరంతర ఘర్షణలు,ముడి చమురు రవాణాను ప్రభావితం చేస్తున్నందున,భారతదేశంలో చమురు పంపిణీలో పెద్ద అంతరాయం ఏర్పడిందని,ఈ కొరత సమయములో దోమ మండల ప్రజలు సరిగ్గా ప్లాన్ చేసుకొని గ్యాస్ ను పొదుపుగా వాడుకోవాలన్నారు.చమురు ఉత్పత్తి లభ్యతలో విపరీతమైన కొరత ఏర్పడినందున ధరలు పెరిగే అవకాశం మెండుగా ఉన్నదని అన్నారు.భిక్ష చేసుకోకుండా గ్యాస్ అడగవద్దని, గ్యాస్ ను డెలివరీ చేసే మా డెలివరీ బాయ్స్ ను ఎలాంటి ఒత్తిడి లేకుండా దోమ మండల హెచ్.పీ గ్యాస్ వినియోగదారులు ఇబ్బందులు పెట్టకుండా సహకరించగలరని హెచ్.పీ గ్యాస్ డీలర్ జి.విష్ణువర్ధన్ రెడ్డి తెలియజేశారు.

## పల్లెల అభివృద్ధిపై ప్రభుత్వ దృష్టి

▸▸ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళితో గ్రామ అభివృద్ధి..

▸▸ సర్పంచ్ దీపికా పాపిరెడ్డి




**పూడూర్ మేజర్ న్యూస్,(మార్చి 7):** గ్రామాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ దీపికా పాపిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శానిటేషన్,పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి వార్డులో వీధి దీపాలు,పిచ్చి మొక్కలు తొలగించి,పరిసరాలను శుభ్రపరచినట్లు తెలిపారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని అన్నారు. 99 రోజుల ప్రణాళిక కార్యచరణలో గ్రామంలోని ముఖ్య సమస్యలను గుర్తించి, పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాఫర్ వార్డు సభ్యులు నాగభూషణం,ఇందిరమ్మ, పుష్పమ్మ,దీప మహేందర్, అనూష పంచాయతీ కార్యదర్శి సాధిక,వివిఓ సరిత తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలోని మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు : జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (మార్చి 07):నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా జిల్లా లోని మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ... మహిళలకు గౌరవం మరియు సమాన అవకాశాలు లభించే సమాజంలోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. నేటి తరం మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, క్రీడలు మరియు రాజకీయ రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ సమాజ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారని పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో మరింత మంది మహిళలు ఆత్మవిశ్వాసం, పట్టుదల మరియు సంకల్పంతో ముందుకు రావాలని ఆమె ఆకాంక్షించారు.మహిళల భద్రత మరియు రక్షణ విషయంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అవసరమైనప్పుడు మహిళలు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, వారి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఆమె భరోసా ఇచ్చారు.మహిళల భద్రత కోసం ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు పాఠశాలలు, కళాశాలలు మరియు గ్రామాల్లో షీ టీమ్, కళ జాత బృందం ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మహిళలు తమ హక్కులు, చట్టాలు మరియు భద్రతకు సంబంధించిన సేవలపై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు.ప్రతి మహిళా తన హక్కులపై అవగాహన పెంపొందించుకుని ధైర్యంగా ముందుకు సాగుతూ తన లక్ష్యాలను సాధించాలని ఆమె పిలుపునిచ్చారు.



## భూ రీసర్వేకు రైతులు సహకరించాలి : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, మేజర్‌న్యూస్ (మార్చి07): కేశంపేట మండలం చింతకుంటపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేకు గ్రామ రైతులు అధికారులకు సహాకరించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. భూ రీసర్వేపై శనివారం గ్రామంలో రైతులకు రెవెన్యూ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని భూములకు నక్షా లేక ఎన్నో ఏండ్లుగా రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, సంభంధిత మంత్రితో మాట్లాడి భూ రీసర్వేకు నోటిఫికేషన్ ఇప్పించామని తెలిపారు. గ్రామంలో అత్యాధునిక టెక్నాలజీ ద్వారా చేయబోయే భూ రీసర్వేతో రైతుల భూ సమస్యలు తీరనున్నాయని, రైతులందరు విభేధాలకు తావు లేకుండా అధికారులకు సహాకరించి సర్వే విజయవంతంగా జరిగేలా సహాకరించాలని సూచించారు. గ్రామంలో భూ సర్వే పూర్తైతే రైతులు, ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. గ్రామంలో భూ సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్‌యాదవ్, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ రాంరెడ్డి, తాసీల్దార్ రాజేందర్‌రెడ్డి, సీఐ నరహరి, ఆర్ఐ చెన్నకేశవులు, మాజీ జడ్పిటిసి తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, నాయకులు కృష్ణారెడ్డి, శ్రావణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అనసూయమ్మ, మల్లేష్, నర్సింహ్మ, గోపాల్, పెంటయ్య, ఇబ్రహీం, శ్రీనాథ్, లతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



## మహిళలందరికీ హ్యాపీ ఉమెన్స్‌డే


### జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (మార్చి 07): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని మహిళలందరికీ జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు.

## ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (మార్చి 07): ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. శనివారం ప్రత్యేక ఇంటెన్సివ్ పునః పరిశీలన (ఎస్ ఆర్ ఐ)లో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియ, లక్ష్యం మేరకు మ్యాపింగ్ పూర్తి చేసే ప్రక్రియలో భాగంగా బూతు స్థాయి అధికారుల పనితీరుపై జిల్లా కలెక్టర్ లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నిక అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులకు మ్యాపింగ్ ప్రత్యేక పై విధివిధానాలను సూచించారు.జిల్లాలో ఇప్పటి 64.29 శాతం మ్యాపింగ్ చేపట్టడం జరిగిందని, పది రోజుల్లో బూతు స్థాయి అధికారులు పట్టణ, గ్రామ స్థాయిలలో మెరుగ్గా పనిచేసినట్లయితే 90 శాతం మ్యాపింగ్ అవుతుందని, దీనిపై తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డిపిఓ, డి డబ్ల్యు ఓ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, డి ఆర్ వో మంగీలాల్, డిపిఓ జయసుధ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నైమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పివి టీకా వాల్‌పోస్టర్ విడుదల

▶▶ నేడు బుద్వేల్‌లో ప్రారంభించనున్న కార్యక్రమం

▶▶ హాజరు కానున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి





రంగారెడ్డి, మేజర్‌న్యూస్ (మార్చి 07) : హెచ్‌పివి టీకా కార్యక్రమానికి సంబంధించిన శనివారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి వాల్ పోస్టర్‌ను శనివారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. బాలికల సంరక్షణ కోసం నిర్వహించనున్న హెచ్ పివి టీకా కార్యక్రమాన్ని ఆదివారం రాజేంద్రనగర్ పరిధిలోని బుద్వేల్‌లో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి తెలిపారు. జిల్లాలోని బాలికలు సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయం ముఖ క్యాన్సర్)నుండి రక్షించడానికి ఈ హేచ్ పి వి టీకా ఇవ్వబడుతుందని ఆమె తెలిపారు. జిల్లాలో ఈ టీకా జిల్లా ఆస్పత్రికి కొండాపూర్, ఏరియా ఆసుపత్రి, వనస్థలిపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, షాద్నగర్, చేవెళ్ల, శంషాబాద్, రాజేంద్రనగర్, మహేశ్వరం, హయత్ నగర్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ వాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. 14 సంవత్సరాల వయసు గల బాలికలు ఈ టీకా కోసం అర్హులనిచెప్పారు. ఈ టీకా తీసుకోవడానికి బాలికలు తల్లిదండ్రులతో పాటు ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు. హెచ్ పివి టీకా వల్ల గర్భాశయ ముఖ క్యాన్సర్ నుండి రక్షణ కల్పిస్తుందని, భవిష్యత్తులో మహిళల ఆరోగ్యాన్ని కాపాడుటలో కీలకపాత్ర పోషిస్తుంది. ఇది సురక్షితమైనది, ప్రభావంతమైన టీకా అని తెలిపారు. చిన్న వయసులో టీకా తీసుకోవడం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని ఆమె తెలిపారు. జిల్లాలోని అర్హత కలిగిన ఈ బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సమీప టీకా కేంద్రాల్లో హెచ్ పి వి టీకా తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ షీబా హయత్ తెలిపారు .ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, జిల్లా వైద్యాధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## డీఆర్‌డీఏలో శుభ్రత కార్యక్రమం



రంగారెడ్డి, మేజర్‌న్యూస్ (మార్చి 07) : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డీఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం ఉద్యోగ సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డీఆర్‌డీఏ పీడి శ్రీలత తన కార్యాలయంలో చీపురు చేత పట్టుకుని బూజును దులిపి శుభ్రం చేశారు.

## ఎమ్.ఈ.వో నిరంజన్‌కి శాలువాతో సన్మానం




మణికొండ , మేజర్ న్యూస్ (మార్చి 6): మణికొండ లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా సేవలందించిన నిర ంజన్‌కి మండల విద్యాశాఖాధికారిగా నియమాకం కావడంతో శనివారం విఆర్ 4 సహాయోగ్ చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టి అందె లక్ష్మణ్‌రావు తదితరులు కలిసి నరంజన్‌కి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంజన్ సార్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన రోజులు పాఠశాల ఎంతో ఎదుగుదల చెందిందని, మండల స్థాయికి ఫలితాలు సాధించడం జరిగిందని అన్నారు. ఇంకా ఎమ్ ఈ ఓ గా విద్యార్థులకు ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది వారి భవిష్యత్తుకు పునాధులు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతారాం దూళిపాళ, దీలిప్‌కక్కడ, కుంబగళ్ల ధన్‌రాజ్, హరి నాథ్‌రెడ్డి, భాను చందర్, ప్రవీణ్, షేక్ ఆరిఫ్, సుబ్రమణ్యం, కామేశ్వర్‌రావు, ముక్తేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ పట్టణంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**మేడ్చల్,మేజర్ న్యూస్( మార్చి 07):** మేడ్చల్ పట్టణంలో వేసవి రాకముందే తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. మార్చి నెలలోనే నీటి ఎద్దడి నెలకొనడంతో పట్టణంలోని పలువురు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బాలాజీ నగర్, ఎంఎంఆర్ కాలనీ, వెంకటరమణ కాలనీల్లో గత ఆరు నెలలుగా వారానికి ఒక్కసారి మాత్రమే నల్లా నీరు సరఫరా అవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమయంలో మంచినీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి కోసం అల్లాడే పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు చెబుతున్నారు. పట్టణంలోని అనేక కాలనీల్లో మంచినీటి సరఫరా సరిగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని, కొన్ని ప్రాంతాల్లో వారానికి ఒక్కసారి లేదా రెండు వారాలకు ఒకసారి మాత్రమే నీరు వస్తుందని స్థానికులు తెలిపారు. నీటి సరఫరా లేకపోవడంతో ట్యాంకర్ల ద్వారా రూ.600 నుంచి రూ.700 వరకు చెల్లించి నీరు తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా సమస్య మరింత తీవ్రతరం అయిందని కాలనీవాసులు పేర్కొన్నారు. పలుమార్లు మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా తాత్కాలిక చర్యలే తీసుకుంటున్నారని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని వారు తెలిపారు.



తాగు నీరు అందక వాటర్ ట్యాంకర్లతో వాటర్ సప్లై..



**నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు: కాలనీవాసి శ్రీనివాస్:**

మనిషి జీవించడానికి నీరు ప్రాథమిక అవసరమని వెంకటరమణ కాలనీ వాసి శ్రీనివాస్ తెలిపారు. తమ కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ట్యాంకర్ల ద్వారా నీరు కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో ప్రజావాణి కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తాత్కాలిక చర్యలతో ఉపశమనం కలిగించడమే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్య కారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

# సొంత నిధులతో తాగునీటి బోరు–తీరిన సమస్య

- గెలిపించిన ప్రజలపై మమకారం– అభివృద్ధికి సహకారం
- బీఆర్ఎస్ కౌన్సిలర్ చిన్నోళ్ల భాస్కర్‌కు శ్రీరంగవరం గ్రామస్తుల కృతజ్ఞతలు



**మేడ్చల్,మేజర్ న్యూస్( మార్చి 07):** ఎల్లంపేట్ మున్సిపల్ పరిధిలోని 21వ వార్డు కౌన్సిలర్ చిన్నోళ్ల భాస్కర్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న శ్రీరంగవరం గ్రామ ప్రజల సమస్యను గుర్తించి తన సొంత నిధులతో తాగునీటి బోరు వేయించి సమస్యను పరిష్కరించారు. బోరులో నీరు పుష్కలంగా రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్ చిన్నోళ్ల భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకి వెళితే శ్రీరంగవరం గ్రామంలో కొంతకాలంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని గుర్తించిన 21వ వార్డు కౌన్సిలర్ చిన్నోళ్ల భాస్కర్ తన సొంత ఖర్చులతో గ్రామంలో కొత్తగా తాగునీటి బోరు వేయించారు. దీంతో గ్రామంలో మంచినీటి సమస్యకు పరిష్కారం లభించిందని స్థానికులు తెలిపారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 21వ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించిన చిన్నోళ్ల భాస్కర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరంగవరం గ్రామ ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల అవసరాన్ని గుర్తించి తన సొంత ఖర్చులతో బోరు వేయించానని తెలిపారు. ఇకపై కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎల్లంపేట్ మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి మరియు ఇతర కౌన్సిలర్ల సహకారంతో 21వ వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, వరలక్ష్మి సురేందర్, నరసింహ, ఓం ప్రకాష్, యూనిస్ పాషా, జీవన్, గ్రామ శాఖ అధ్యక్షుడు బాలరాజు, గ్రామ యువజన నాయకుడు తలారి శంకర్, నాయకులు కొండల్ రెడ్డి, ముత్యాల మాధవరెడ్డి, రంగారెడ్డి, శశాంక్ రెడ్డి, శ్రావణ్, మరుగన్ నరసింహ, విష్ణు తదితరులు మరియు వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం




**కొడంగల్, మేజర్ న్యూస్ (మార్చి 7):** కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో ఉషశ్రీ, ప్రభుత్వాసుపత్రి వైద్యులు శ్రావణి, సాకేత్ హాజరయ్యారు. ఎంపీడీవో ఉషశ్రీ మాట్లాడుతూ మహిళలకు ఒకప్పుడు ఆకాశం హద్దు అనే వారని, కానీ నేడు అంతరిక్షాన్ని కూడా వారు జయించారన్నారు. మహిళలకు ఆర్మీ, పైలెట్, లోకో పైలెట్ లాంటి ఉద్యోగాల్లో చేరే అవకాశం ఉండేది కాదని, నేడు మహిళలు చేయని ఉద్యోగమే లేదన్నారు. మహిళలు అన్నీ రంగాల్లో రాణిస్తున్నా.. ఇప్పటికీ వివక్షతకు గురవుతున్నార న్నారు. డ్రగ్స్, బాల్య వివాహాలు లాంటి విషయాల పట్ల అప్రమత్తంగా ఉంటూ షీటీమ్స్ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ తల్లిని గౌరవించాలన్నారు. సమాజం మొత్తం ఒక వైపు ఉన్నా పిల్లలకు అండగా ఉండేది తల్లి మాత్రమే అన్నారు. కళాశాలలో విద్యాబోధన అద్భుతంగా ఉందని, విద్యార్థులు కళాశాలలో వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. వైద్యురాలు శ్రావణి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం హెచ్‌పీవీ టీకాలను ఉచితంగా అందిస్తుందని విద్యార్థినులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తల్లి మాట వినని కుమారుడు, భార్య చెబితే వనని భర్త, కూతురు అడిగితే కాదనని తండ్రి ఉండరని, అది వారి గొప్పతనం అన్నారు. మహిళలు ఎంతో ఓర్పుతో కుటుంబ బాధ్యతను నిర్వర్తిస్తున్న ఆదర్శ మూర్తులన్నారు. ఇప్పటికీ మహిళలు సమాన పనికి సమాన వేతనం పొందడం లేదన్నారు. ఇది తొలగినప్పుడే సమాజ వికాసం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కో ఆర్డినేటర్ యం.హరిప్రియ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాస్, కె.అన్నపూర్ణ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు




**మేడ్చల్, మేజర్ న్యూస్ (మార్చి 07):** కొంపల్లి– 2లోని శ్రీ చైతన్య పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. దీప ప్రజ్వలనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చేగుంట మండల విద్యాధికారి (ఎంఈఓ) నీరజ మేడమ్, పేట్ బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు ప్రోత్సాహక సందేశాలు అందించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి జోన్– 1 ఏజీఎం జి.వి. రమణరావు, జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ రవి, జోనల్ అసోసియేట్ కోఆర్డినేటర్ సోమేష్, జోనల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, మేడ్చల్ ఐపీఎల్ ఐసీ ప్రిన్సిపాల్ సురేష్, జోనల్ ప్రైమరీ కోఆర్డినేటర్ లావణ్య, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ కావ్య రెడ్డి హాజరై కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చారు.

**విద్యతో పాటు ప్రతిభకు వేదిక**

పాఠశాల ప్రిన్సిపాల్ హేమలత మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలను వివరించారు. శ్రీ చైతన్యలో కేవలం విద్యనే కాకుండా ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. హాస్టల్ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి మాట్లాడుతూ రెసిడెన్షియల్ క్యాంపస్ అయినప్పటికీ విద్యార్థులకు ఇంటి వాతావరణాన్ని తలపించేలా పాఠశాల నిర్వహణ జరుగుతుందని చెప్పారు. పిల్లల్లో మంచి విలువలు పెంపొందించేలా పాఠశాల వాతావరణం ఉంటుందని డీన్ శ్రీకాంత్ రెడ్డి, అసోసియేట్ డీన్ రాజా పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల సిబ్బంది ఎల్లప్పుడూ తోడుగా ఉంటారని సి.ఓ.ఐ.పి.ఎల్ ఇన్‌చార్జి త్రివేణి, ఐపీఎల్ ఇన్‌చార్జి రమేష్ రెడ్డి, ఎంఫిఎల్ ఇన్‌చార్జి కృష్ణంరాజు, సి బ్యాచ్ ఇన్‌చార్జి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎంసీ పల్లి మున్సిపాలిటీ చైర్మన్ జాం రవి


పరిసరాల పరిశుభ్రతలో మున్సిపల్ కమీషనర్, చైర్మన్

**శామీర్‌పేట్,మేజర్ న్యూస్ (మార్చి 07):** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మూడు చింతలపల్లి మున్సిపాలిటీ చైర్మన్ జాం రవి, మున్సిపల్ కమిషనర్ పవన్ కుమార్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమం సందర్భంగా శనివారం మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు (పోతారం, నారాయణపూర్)లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్లను శుభ్రం చేయడంతో పాటు పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ జాం రవి మాట్లాడుతూ,.. ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం మున్సిపల్ కమిషనర్ పవన్ కుమార్, కౌన్సిలర్ల సహకారంతో మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడు చింతలపల్లి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ముందు వరుసలో నిలిపి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ వంగా ప్రియాంక శ్రీకాంత్ రెడ్డి, 1వ వార్డు కౌన్సిలర్ ముద్దం పాపిరెడ్డి, 6వ వార్డు కౌన్సిలర్ నీరజ్ గౌడ్, 5వ వార్డు కౌన్సిలర్ సరిత శ్రీనివాస్ గౌడ్, 9వ వార్డు కౌన్సిలర్ పెద్దిరెడ్డి శ్రీలత వెంకట్ రెడ్డి, 21వ వార్డు కౌన్సిలర్ రాజిగల్ల లతా భూపాల్, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.


# ప్రజా ప్రభుత్వంతోనే పేదోడి సొంతింటి కల సాకారం

- డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్


**శామీర్‌పేట్,మేజర్ న్యూస్ (మార్చి 07):** ప్రజా ప్రభుత్వంతోనే పేదోడి సొంతింటి కల సాకారం అవుతుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని యాడారం గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డితో కలిసి పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

**పేదల కళ్లలో ఆనందం:**

ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ,.. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్లే పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇండ్లు ముఖ్యమైన నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సిములు యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కాన్ రెడ్డి మాలతి మాధవరెడ్డి, అలియాబాద్ మూడు చింతలపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్, దోసకాయల వెంకటేష్, నాయకులు సరసం అశోక్ రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇందిరమ్మ గృహ ప్రవేశంలో వజ్రేష్ యాదవ్

# ఎక్స్టెన్షన్ లెక్చరర్ల సేవలు అభినందనీయం : ప్రిన్సిపల్ కాంచనలత



చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి07): పాఠ్య బోధనలో అంతరాయం కలగకుండా ఎక్స్టెన్షన్ లెక్చరర్ల సేవలు అభినందనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కాంచనలత అన్నారు. వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో బీకాం విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేసిన ఎక్స్టెన్షన్ లెక్చరర్ రాగిణిని సన్మానించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.... అధ్యాపకులు అందుబాటులో లేని సమయంలో విద్యార్థుల పాఠ్య బోధనలో అంతరాయం కలగకుండా తరగతుల నిర్వహణలో ఎక్స్టెన్షన్ లెక్చరర్ల సేవలు వినియోగించుకున్నామని తెలిపారు. విద్యార్థులతో పరస్పర చర్చలు జరిపి పాఠ్యాంశాలను వివరించారని తెలిపారు. ఈ తరగతులు విద్యార్థులకు ప్రయోజనకరంగా నిలిచాయన్నారు. విద్యార్థుల పురోగతికి అందించిన విలువైన సేవలను కొనియాడారు. విద్యాభివృద్ధి కోసం ఎక్స్టెన్షన్ లెక్చరర్ల రాగిణి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రత్యేక సంస్థాగత బలోపేతం కార్యక్రమం

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యచరణలో భాగంగా ప్రత్యేక సంస్థాగత బలోపేతం కార్యక్రమం ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ కాంచనలత తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యచరణ కార్యక్రమంతో కళాశాల ఆవరణలో శుభ్రపర్చడం జరిగిందన్నారు. విద్యార్థులు తమ గదులను, పరిసరాలను శుభ్రపరిచారని తెలిపారు. కళాశాల అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, ఎన్సీసీ యూనిట్లు, విద్యార్థుల సమీష్టి కృషితో ప్రత్యేక సంస్థాగత బలోపేతం కార్యక్రమం విజయవంతం చేశారని తెలిపారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని బిజెపి నాయకుడు : నిరుడు శేఖర్ ముదిరాజ్ ఆగ్రహం

గండిపేట్ మేజర్ న్యూస్ (మార్చ్ 07) కేంద్ర లో బిజెపి ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించి గౌరవిస్తే. రాష్ట్రంలో మాత్రం మహిళలకు భద్రత కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేసిన రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడు నిరుడు శేఖర్ ముదిరాజ్. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సాధికారతకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆదర్శవంతమైనయని కిస్మత్పూర్ మాజీ ఉపసర్పంచ్ రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్ ముదిరాజ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో మహిళలకు ఎప్పుడు అత్యున్నతమైన స్థానం కల్పించారని గుర్తు చేశారు. దానికి అనుగుణంగానే కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో 33% రిజర్వేషన్లు మహిళలకు కల్పించి వారిని గౌరవించిందని . దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో మహిళల భద్రత స్వయం సమృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేశారని తెలిపారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం భేటీ బచావో భేటీ పడావో అనే నినాదంతో మహిళల భద్రతకు, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మాత్రం దీనికి భిన్నంగా మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతిరోజు ఏదో ఒక చోట మహిళలపై అగత్యాలు అత్యాచారాలు పెరిగిపోయాయని. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.



# నాణ్యమైన విద్యానందిస్తాం

- సంజోయ్ పబ్లిక్ స్కూల్‌లో సిబిఎస్‌సి ప్రారంభం
- గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్








మహేశ్వరం,మేజర్‌న్యూస్(మార్చి 7): నాణ్యమైన విద్యానందిస్తామని డాక్టర్ పౌలిని అన్నారు.శనివారం మండలంలోని చిన్న తూప్రా గ్రామంలో సంజోయ్ పబ్లిక్ స్కూల్ లో సిబిఎస్‌సి ప్రారంభోత్సవంలో సర్పంచ్ రాజు గొల్లూరితో,గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు మంచి విద్యానందిచలనే లక్ష్యంతో ,మారుతున్న కాలనికి అనుగుణంగా విద్యాను అందిస్తామని తెలిపారు.పిల్లల సంస్కృతిక కార్యక్రమాలతో ఎంతో అలరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రిజన, కర్పడెంట్ ,మరింటోం,మేనేజర్ సిస్టర్ లిజబెత్, సిస్టర్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వేమ్ నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన టిపిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి



గండిపేట్ మేజర్ న్యూస్ (మార్చ్ 07 ) కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ముఖ్యమంత్రి సలహాదారులు వేమ్ నరేందర్ రెడ్డి ని రాజ్యసభ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేసిన టిపిసిసి అధికార ప్రతినిధి ముంగి జయపాల్ రెడ్డి. శనివారం ఆయన వేమ్ నరేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ మామిడి నర్సింగరావు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగిడి ఓం ప్రకాష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైకల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అనుమానస్పద స్థితిలో మహిళ మృతి



జల్ పల్లి, మేజర్ న్యూస్ (మార్చ్ 07): అనుమానాస్పద స్థితిలో మహిళా మృతి చెందిన ఘటన శుక్రవారం పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పహాడీ షరీఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. నల్గొండ జిల్లాకు చెందిన మేకల వెంకటయ్య, అతని భార్య మేకల గీత (35)కు 10 సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. జీవనోపాధి కోసం సుమారు రెండు సంవత్సరాల క్రితం తుక్కుగూడకు వచ్చి అద్దెగదిలో నివసిస్తున్నారు. మేకల గీత తుక్కుగూడలోని ఒక హాస్టల్లో పనిచేస్తుండగా, ఆమె భర్త మేకల వెంకటయ్య కర్రీ పాయింట్ లో పనిచేస్తున్నాడు. ఈనెల 5న రాత్రి 11గంటల సమయంలో, మృతురాలి గది పక్కన నివసిస్తున్న వ్యక్తి, మేకల గీత మృతి చెందినట్లు ఫోన్ ద్వారా మృతురాలి సోదరునికి సమాచారం ఇచ్చాడు. వెంటనే మృతురాలి సోదరుడు అక్కడికి చేరుకొని తన అక్క మృతి చెందినట్లు గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. తన అక్క మృతికి తన బావ అయిన మేకల వెంకటయ్య పై అనుమానం వ్యక్తం చేస్తూ పహాడి షరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించి, మహిళ మృతికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

## యువతి అదృశ్యం



జల్ పల్లి, మేజర్ న్యూస్ (మార్చ్ 07): యువతి అదృశ్యమైన సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. బాలాపూర్ మండలం, జల్ పల్లి ప్రాంతానికి చెందిన కేతావత్ లక్ష్మణ్ కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతని పెద్ద కుమార్తె వివాహం జరగగా, అతని భార్య, ఇద్దరు కుమారులు, చిన్న కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. ఈనెల 5న ఉదయం 10గంటలకు అతను, అతని భార్య కుమారులు పనులకు వెళ్లారు. ఆ సమయంలో అతని చిన్న కుమార్తె ఇంట్లోనే ఉంది. సాయంత్రం 6గంటలకు వారందరూ తిరిగి ఇంటికి వచ్చి చూడగా తన కుమార్తె ఇంట్లో కనిపించలేదు. దీంతో లక్ష్మణ్ తన కుమార్తె గురించి చుట్టుపక్కల ప్రాంతాలలో, బంధువుల వద్ద ఎత్తిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో పహాడీ షరీఫ్ పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేశాడు. అయితే తన కుమార్తెను మహబూబ్ నగర్ కు చెందిన ముదావత్ అనిల్ అనే వ్యక్తి తీసుకెళ్లి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ, లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బాడీ బిల్డర్‌ను కలిసిన రాజు



జల్ పల్లి, మేజర్ న్యూస్ (మార్చ్ 07): ప్రపంచ బాడీ బిల్డర్ గా పేరుగాంచిన మోహతేషామ్ అలీ ఖాన్ ను కలిసిన శ్రీరామ కాలనీ ఎంఐఎం అధ్యక్షులు గనాటే రాజు. ఈ సందర్భంగా గనాటే రాజు మొహతేషామ్ నివాసానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వచనం పొందారు. ఇటీవలే ఎంఐఎం పార్టీలో చేరి, శ్రీరామ కాలనీ ఎంఐఎం అధ్యక్షునిగా నియమితుడయ్యానని తెలిపారు. అనంతరం అలీ ఖాన్ రాజుని సన్మానించి, పార్టీ కోసం కష్టపడి పని చేయాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి07): బైక్ కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నవాబ్‌పేట్ మండలం ఏత్రాస్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ మనీల కుమారుడు వినీల్(20) చిన్నప్పటి నుంచి మున్సిపల్ పరిధిలోని దేవునిఎర్రవల్లి వార్డు మేనమామ వద్ద ఉంటూ ఇంటర్ వరకు చదువుకున్నాడు. శనివారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన స్నేహితుడు అభిలాష్‌తో కలిసి షాద్‌నగర్ వెళ్లి వస్తుండగా పామెన స్టేజ్ వద్ద ఆల్టో కారు గ్రామం వైపు మలుపుతుండగా ఒక్కసారిగా బైక్ కారును ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరు ఎగిరిపడగా వినీల్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక ఉన్న అభిలాష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చూసి వారిని 108వాహనంలో చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డా అభిలాష్‌ను మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు





**కీసర,మేజర్ న్యూస్,(మార్చి 07):** పురుషులతో సమానంగా నేడు మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని కీసర శ్రద్ధ, స్ఫూర్తి కళాశాలల చైర్మన్ ఎండి మధార్ పేర్కొన్నారు. కీసర శ్రద్ధ, స్ఫూర్తి కళాశాల్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంకు ముఖ్య అతిధులుగా కీసర గ్రామ మాజీ సర్పంచ్ నాయకపు మాధురి, మాజీ ఎంపీటీసీ బెలిదే రమేష్ గుప్తలు విచ్చేశారు. తొలుత భారత దేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పులే చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు, సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులకు చైర్మన్ జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళల రక్షణ చట్టాలు, భద్రతా హక్కులు తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చిన్న వయస్సులో తప్పుదారిని ఎంచుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరీక్షలపై ఆందోళన చెందకుండా ప్రణాళికాబద్ధంగా చదవాలి : మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి

▸▸ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ





**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (మార్చి 07) :** పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు లోనుకాకుండా మిగిలిన సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించగలరని పోచారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్‌లోని కొర్రెముల, ప్రతాప్ సింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం బోయపల్లి కొండల్ రెడ్డి సహకారంతో నిర్వహించగా, అన్నోజిగూడ యువజన సంఘాల నాయకులు విద్యార్థులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలకు మిగిలిన కొద్దిసమయాన్ని సమర్థంగా వినియోగించుకొని పాఠాలను పునశ్చరణ చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చున్నారు. విద్యార్థులు ధైర్యంగా పరీక్షలను ఎదుర్కొని తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొంటూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి, ప్రభు గౌడ్, రఘురాం రెడ్డి, పాశం లక్ష్మణ్ యాదవ్, ఉసికె రాఘవేందర్ రెడ్డి, సంతోష్ నాయక్, తిలక్ నాయక్, మహీందర్ నాయక్, కొమ్ముల ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ: భీమిడి జైపాల్ రెడ్డి

▸▸ తూంకుంటలో శ్రీ సాయి భవాని బోన్ సెట్టింగ్ సెంటర్ ఘనంగా ప్రారంభం

**శామీర్‌పేట్, మేజర్ న్యూస్ (మార్చి 07):** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తూంకుంటలో నర్సింహా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ సాయి భవాని బోన్ సెట్టింగ్ సెంటర్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. వారి ఆహ్వానం మేరకు జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్థానిక నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించారు.

**ఎముకల గాయాలకు చికిత్స అందుబాటులోకి:**

ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ,.. ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఎంతో ఆనందకరమని తెలిపారు. ఎముకల గాయాలు, మెలికలు వంటి సమస్యలకు చికిత్స అందించే ఈ బోన్ సెట్టింగ్ సెంటర్ ద్వారా తూంకుంటతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్ష కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా యజమాని నర్సింహాకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ



బోన్ సెట్టింగ్ సెంటర్ ను ప్రారంభిస్తున్న జైపాల్ రెడ్డి

కార్యక్రమంలో నాయకులు ఎల్.ఎస్. బాల్‌రాజు గౌడ్, మన్నే బిక్షపతి, టీఆర్ రవీందర్ గౌడ్, మేకల అంజనేయులు, సందని ఆనంద్, బాణాల భూపాల్ రెడ్డి, లింగం గౌడ్, సామల దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొత్తగా ప్రారంభమైన ఈ బోన్ సెట్టింగ్ సెంటర్ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడాలని పాల్గొన్నవారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయాలి

▸▸ మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్



రోడ్డు పక్కన ముళ్ళ పొదల్లను జేసిబితో చదును చేయిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్

**పరిగి, మేజర్ న్యూస్ (మార్చి 07):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక ను విజయవంతం చేయాలని పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని 16 వ వార్డు శాంతినగర్ కాలనీలో పర్యటించి నాలా వద్ద చెట్లను తొలగించి జెసిబి తో శుభ్రం చేయించారు. మురికి కాలువలను శుభ్రం చేయించారు. వీధి దీపాలను పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధిపరిచి సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ఈ కార్యక్ర మాన్ని చేపట్టిందన్నారు. అందరి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ విశాల్, పురపాలక సంఘ కమిషనర్ వెంకటయ్య వార్డ్ ఆఫీసర్, మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, నాయకులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**ఘట్‌కేసర్, మేజర్ న్యూస్(మార్చి, 07):** ఘట్‌కేసర్‌లోని సంస్కృతి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అస్మిత- ఖేలో ఇండియా ఆధ్వర్యంలో ప్రత్యేక క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల పలు పాఠశాలలు, కళాశాలలనుండి సుమారు 650 మంది విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు పరుగుపందాలు, ఫన్నీ గేమ్స్ నిర్వహించారు. పోటీలు వయస్సు ఆధారంగా అండర్-13, అండర్-18 మరియు 18 సంవత్సరాల పైబడిన విభాగాల్లో నిర్వహించారు.కార్యక్రమానికి సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. జనకిరాములు, డైరెక్టర్ డాక్టర్ మల్లాది రామకాంత్ రెడ్డి గారు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థినులను అభినందించారు. విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు, పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం. హరి ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ సురేష్, మై భారత్ టీమ్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## యాలాల మండలంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

▸▸ ముఖ్య అతిథిగా ఎంపీడీవో సాయి శ్రీనిజ

▸▸ మండల విద్యాధికారి ఎస్. మహిపాల్ రెడ్డి




**యాలాల మేజర్ న్యూస్, (మార్చి 7)** మండల విద్యాధికారి ఎస్.మహిపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక విద్యా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి విద్యార్థుల కోసం నిర్వహించనున్న ఈ ప్రత్యేక కోచింగ్ కార్యక్రమం ద్వారా సుమారు 750 మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. ఈ ప్రత్యేక తరగతులు మార్చి 14 నుండి ఏప్రిల్ 15 వరకు నిర్వహించబడతాయి. ఈ కోచింగ్ కార్యక్రమం కోసం జడ్పీహెచ్ఎస్ బాయ్స్ యాలాల, జడ్పీహెచ్ఎస్ అగ్గనూర్, ప్రతిభ రెసిడెన్షియల్ స్కూల్, గౌతమి మోడల్ పాఠశాలలను కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. మొత్తం నాలుగు కేంద్రాల్లో ఈ ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మార్చి 7న సమావేశం నిర్వహించి మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వివరాలు తెలియజేశారు. విద్యార్థులు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుండి ప్రత్యేక తరగతులకు హాజరై మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండల స్థాయిలో "టాలెంట్ సెర్చ్" పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి శ్రీనిజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే ఆర్‌పీలు గోవర్ధన్ రెడ్డి, శివప్ప, బాలకృష్ణ, పరమేశ్, దీపక్ రాథోడ్, ప్రభాకర్ చారి, రవి, మురహరి, సంజీవ్, శశిధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ మూడావత్ హనుమంతు (కమల్)




**పరిగి. మేజర్ న్యూస్ (మార్చి 07).** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక లో భాగంగా పరిగి మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు నజీరాబాద్ తండా (మల్కాపూర్ తండా) లో మున్సిపల్ వైస్ చైర్మెన్ ముడావత్ హన్మంతు (కమల్) తండాలో పర్యటించి వివిధ పారిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించారు. అవసరమైన చోట తండాలో రోడ్డు కు మరమ్మతులు చేయించి మట్టి పోసి చదును చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....తండాలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వార్డును అని విధాలుగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్ లదే కీలక పాత్ర

### సర్పంచ్ ల శిక్షణ ముగింపులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కడ్తాల, మేజర్ న్యూస్ ( మార్చి 07): గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలులో గ్రామ సర్పంచ్ లదే కీలక పాత్ర అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దిశా నిర్ధేశం చేశారని కడ్తాల్ సర్పంచ్ రాయికంటి బిక్షపతి తెలిపారు. ఈ మేరకు గ్రామపంచాయతిల అభివృద్ధి, పంచాయతిరాజ్ చట్టం పై నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లకు అవగాహన కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ లో పంచాయతిరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ , స్వర్ణభారత్ ట్రస్ట్ ల ఆధ్వర్యంలో గత 5 రోజులుగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా శనివారం ముగింపు కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జిల్లా అధికారులతో కలిసి తనతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచ్ లకు ధృవపత్రాలు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్.పి సీఈఓతో పాటు కడ్తాల్ ఎంపీడీవో సుజాత నాయక్, మక్తమాదారం సర్పంచ్ నరసింహ, 24 గ్రామ పంచాయతీల సర్పంచ్ లు పాల్గొన్నట్లు కడ్తాల్ సర్పంచ్ బిక్షపతి తెలిపారు

# పరిశుభ్రత, పారిశుధ్యంపై విద్యార్థుల ప్రతిజ్ఞ



షాబాద్ మేజర్ న్యూస్ (మార్చి 07) షాబాద్ మండలంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం మన్మర్రి గ్రామంలో ప్రాథమిక పాఠశాల,ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ లాలాపేట బందయ్య,గ్రామ కార్యదర్శి శివకుమార్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసప్ప,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాయులు మర్పల్లి అశోక్,ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రత,పారిశుద్ధ్యం పై ప్రతిజ్ఞ చేయించారు.పాఠశాల ఆవరణలోని చెత్తను తొలగించారు.ఈ సందర్భంగా ఇరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బసప్ప,మర్పల్లి అశోక్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని,అందులో భాగంగా పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమం మార్చి పదిహేను తారీకు వరకు కొనసాగుతుందని తెలిపారు.ఈ పది రోజుల్లో గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత,పారిశుధ్యం, ప్రభుత్వ భవనాల సంరక్షణ,రికార్డుల సమగ్ర నిర్వహణ,పెండింగ్ ఫైల్స్ పరిష్కారం,డిజిటల్ పాలన బలోపేతం వంటి అంశాలపై దృష్టి సాధించాలని తెలిపారు. విద్యాశాఖ పాలన పరిధిలో పాఠశాల ప్రాంగణమంతా పరిశుభ్రతలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, వంటశాలలు, కార్యాలయాలు శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టాలని, త్రాగునీరు,మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు .శానిటేషన్ కార్మికులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని,పాఠశాల సిబ్బంది అందరూ రోజువారి కార్యక్రమాలను పాటించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది దశరథ రెడ్డి, అంబర్ సింగ్,పరమేష్ సుదర్శన్,చంద్రయ్య, వెంకటమ్మ,శ్రీలత,చంద్రకళ, శ్యామలమ్మ,మల్లమ్మ, వెంకటయ్య,రాజలింగం, పరమేష్,తదితరులు పాల్గొన్నారు.




# రోడ్లు, మురుగు సమస్యలపై నివాసితుల ఆవేదన

### రామిడి హిల్స్ కాలనీ వాసులతో కాంగ్రెస్ నాయకుడు ఎన్. మల్లారెడ్డి పర్యటన



బాలాపూర్, మేజర్ న్యూస్ (మార్చి 07): అల్మాస్‌గూడ గ్రామంలోని రామిడి హిల్స్ కాలనీ 57వ డివిజన్, నాదర్‌గుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలనీ వాసులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు తమ సమస్యలను వివరంగా తెలియజేశారు.కాలనీలో రెండు రోడ్లకు తక్షణమే సీసీ రోడ్లు వేయాలని వారు కోరారు. అలాగే కాలనీ సమీపంలోని పోచమ్మ కుంటలోకి మురుగు నీరు చేరడంతో దోమల బెడద తీవ్రంగా పెరిగిందని, సానిటేషన్ పనులు కూడా సరిగా జరగడం లేదని నివాసితులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు స్థానిక సర్కిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని నాయకులు తెలిపారు. పైప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు సరిగా వెళ్లేలా పెద్ద ట్రంక్ లైన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఈ విషయంపై బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడి అంచనాలు సిద్ధం చేయిస్తామని సీనియర్ నాయకుడు మల్లారెడ్డి పేర్కొన్నారు.అలాగే మహేశ్వరం ఇంచార్జ్ కేఎల్‌ఆర్ దృష్టికి తీసుకెళ్లి, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేయించి ట్రంక్ లైన్ ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని కాంగ్రెస్ పార్టీ తరపున కాలనీ వాసులకు ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి, రామిడి బాల్‌రెడ్డి, మల్లేష్, చిరంజీవి, సైదా నాయక్, రామకృష్ణ, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : డిఆర్‌డివో శ్రీలత



మహేశ్వరం,మేజర్‌న్యూస్(మార్చి 7): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనిడిఆర్‌డివో శ్రీలత అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో స్త్రీశక్తి భవనం అవరణంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మహిళా సంఘాల సభ్యులతో కలసి కార్యాలయం లో దుమ్ము దులిపి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఇల్లు, కార్యాలయాలు , పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు .ఈ కార్యక్రమంలోఎపివో సత్యనారాయణ,ఎపిఎం పరిమళ, పంచాయతీ కార్యదర్శి సుజాత, సీసీ లు,టిఏలు లు, వివోఏలు, గ్రామ పంచాయతీ వర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపిన సామేల్ రాజు



మహేశ్వరం, మేజర్ న్యూస్ (మార్చి7): మాజీ ఐటి పరిశ్రమల శాఖ మంత్రి బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్, మాజీ విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డిలను శనివారం కేటీఆర్ నివాసంలో తుక్కుగూడ మున్సిపాలిటీ యూత్ ప్రెసిడెంట్ సామేల్‌రాజు మర్యాద పూర్వకంగా కలిసి శుభకాంక్షలు తెలిపారు.

## మహిళ దినోత్సవ వేడుకలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ కె. ఉషారాణి



గండిపేట్ మేజర్ న్యూస్ (మార్చ్ 07 ) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నార్సింగి సర్కిల్ పరిధిలోని నాగార్జున గ్రూప్ ఆఫ్ స్కూల్స్ శారద విద్యానికేతన్ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కౌన్సిలర్ ఉషారాణి పాల్గొని మహిళల శక్తి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు వంటింటికే పరిమితం కావద్దని సూచించారు. మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలుగుతారని వారిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఎన్నో పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ను ప్రధాన ఉపాధ్యాయురాలని గజమాలతో ఆమె సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ముస్లిం మహిళలపై వేధింపులు తగ్గాలి: నసీమ్ సుల్తానా



జల్ పల్లి, మేజర్ న్యూస్ (మార్చ్07): ముస్లిం మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్న, వరకట్న వేధింపుల కేసులు మాత్రం తగ్గడం లేదని జిహెచ్ఎంసి జల్ పల్లి షాహిన్ నగర్ కు చెందిన నసీమ్ సుల్తానా పేర్కొన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా ముస్లిం మహిళలకు స్వేచ్ఛను కల్పించాలని ప్రభుత్వాన్ని ఆమె కోరారు. యువకులు వరకట్నం వేదింపులలో అత్తవారి చేతి లో మతం అయితే, మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తెచ్చి, నిందితులను శిక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

# లార్డ్స్ హై స్కూల్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**మహిళా ఉపాధ్యాయులు, సిబ్బందికి సత్కారం**




బాలాపూర్, మేజర్ న్యూస్ (మార్చి 07):జిల్లెలగూడలోని లార్డ్స్ హై స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులు, మహిళా సిబ్బందిని శాలువతో సన్మానిస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సిద్దాల బీరప్ప ముఖ్య అతిథిగా హాజరై మహిళా ఉపాధ్యాయులు, సిబ్బందికి శాలువాలు కప్పి సత్కరించి వారి సేవలను అభినందించారు. మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.లార్డ్స్ గ్రూప్ వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ సిద్దాల శ్రీలత మాట్లాడుతూ... విద్య, విజ్ఞానం, వైద్యం, సాంకేతికత, క్రీడలు, పరిపాలన వంటి అన్ని రంగాల్లో మహిళలు పురుషులకు ఏమాత్రం తక్కువ కాదని అన్నారు.పాఠశాల డీన్ బి. సతీష్ కుమార్ మాట్లాడుతూ... మహిళలు ప్రతిభతో ప్రతి రంగంలో రాణిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడుతున్నారని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎం.ఎల్. మరియన్ మహిళా సాధికారతపై ప్రేరణాత్మక సందేశాలు అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని మహిళా దినోత్సవాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

# లార్డ్స్ విద్యాసంస్థల్లో ఆనందోత్సాహాలతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**మహిళా ఉపాధ్యాయుల సేవలకు యాజమాన్యం అభినందనలు**

బాలాపూర్, మేజర్ న్యూస్ (మార్చి 07):బడంగ్‌పేట్‌లోని లార్డ్స్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ఉపన్యాసాలు, నాటకాలు, పాటలు మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా లార్డ్స్ గ్రూప్ ఆఫ్ సంస్థ చైర్మన్ సిద్దాల బీరప్ప మాట్లాడుతూ... మహిళలు సమాజంలో అన్ని రంగాల్లో సాధించిన విజయాలు ఎంతో గొప్పవని అన్నారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో మహిళలు విశేషంగా రాణిస్తూ సమాజ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా ఉపాధ్యాయుల సేవలను ప్రత్యేకం గా అభినందించారు.

లార్డ్స్ గ్రూప్ వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళల హక్కులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమాజంలో స్త్రీపురుష సమానత్వం నెలకొల్పాలని, "ఆకాశంలో సగం అవకాశంలో సగం"



అనే నినాదంతో మహిళా సాధికారతను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

లార్డ్స్ డైరెక్టర్ సిద్దాల శ్రీలత మహిళా ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ సతీష్, ప్రిన్సిపాల్ రామిడి సంతోష్, ఇన్‌చార్జ్ రేఖ సాగర్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కందుకూరు నూతన సీఐకి సన్మానం




కందుకూరు, మేజర్‌న్యూస్( మార్చి 07): ఫ్యూచర్‌సిటీ కమీషనరేట్‌లోని కందుకూరు సీఐగా హెచ్.వెంకటేశ్వర్లు బదిలిపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. శనివారం కందుకూరు మండలం బాచుపల్లి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎగిరిశెట్టి నరేష్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. సీఐని కలిసిన వారిలోమాజీ వైస్ ఎంపీపీ ఆనేగౌని




సంధ్యాదామోదర్ గౌడ్, మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, వార్డు సభ్యులు ఎగిరిశెట్టి రాజు లు ఉన్నారు.మండల ప్రజలకు పటిష్టమైన రక్షణ కల్పించడంలో తమవంతు కృషి చేయాలని వారు కోరారు.

★ధర్మసమాజ్ పార్టీ బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షులు గుండ్రపల్లి అమరేందర్ ఆధ్వర్యంలో సీఐ వెంకటేశ్వర్లును శాలుతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సీహెచ్ అంజనేయులు,నాయకులు రమేష్, గిరి, వినయ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ సర్కిల్‌లో 'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక' అమలు ఏంటి..?





బాలాపూర్, మేజర్ న్యూస్ (మార్చి 07):రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి ప్రారంభించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమం బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో అమలవుతున్నదా.. లేదా... అన్నది స్పష్టత లేకపోవడంతో స్థానిక ప్రజలు, మీడియా వర్గాల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, బడంగ్‌పేట్ సర్కిల్‌లో మాత్రం దీనిపై అధికారిక సమాచారం వెలువడకపోవడం చర్చనీయాంశంగా మారిందిని పలువురు అంటున్నారు.జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ కార్యక్రమానికి బడంగ్‌పేట్ సర్కిల్‌కు మినహాయింపు ఇచ్చారా...? లేక కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ సమాచారం బయటకు రాకుండా ఉందా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాధారణంగా ప్రభుత్వ కార్యక్రమాలపై మీడియాకు ముందుగానే సమాచారం ఇవ్వడం, ప్రెస్ నోట్ విడుదల చేయడం సంబంధిత అధికారుల బాధ్యతగా ఉంటుందిని పేర్కొన్నారు.అయితే గత రెండు రోజులుగా ఈ కార్యక్రమంపై ఎలాంటి ప్రకటన లేకపోవడం పట్ల మీడియా ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బడంగ్‌పేట్ సర్కిల్ అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు, మీడియా వర్గాలు కోరుతున్నాయి.

# చలివేంద్రం ప్రారంభం



కొందుర్గు, మేజర్‌న్యూస్(మార్చి 07): మండల కేంద్రం శివారులోని దివ్యశక్తి పరిశ్రమ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కొందుర్గు సర్పంచ్ చౌడాపురం ప్రభాకర్ శనివారం ప్రారంభించారు. దివ్యశక్తి పరిశ్రమ యాజమాన్యం ప్రతి సంవత్సరం బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, వేసవిలో ప్రయాణికులు, గ్రామస్థుల దహార్తిని తీర్చడం సంతోషకరమని, ఈ సందర్భంగా పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో దివ్యశక్తి పరిశ్రమ యాజమాన్యం, డిజిఏం అజిత్‌దాస్, సునిల్ బురాన్, హెచ్ ఆర్ మేనేజర్ సతీష్, పంచాయితీ కార్యదర్శి సురేఖ, ఉప సర్పంచ్ సి చంద్రశేఖర్,వార్డు సభ్యులు వాసూరి, దుర్గని శ్రీను, జంగయ్య, లింగం, శ్రీకాంత్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియా, డిఏపిలతో పెట్టుబడి ఖర్చు తగ్గి పర్యావరణానికి మేలు : ఏడిఏ శోభారాణి



ఆమనగల్లు మేజర్ న్యూస్ (మార్చ్07) రైతులకు నానో యూరియా, డిఏపీలతో పెట్టుబడి ఖర్చు తగ్గి పర్యావరణానికి మేలు చేస్తుందని ఏడిఏ శోభారాణి సూచించారు. శనివారం ఆమనగల్లు రైతు వేదికలో రైతులకు నానో యూరియా, డిఏపి వినియోగంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడుతూ ఆత్మ పథకంలో భాగంగా రైతులకు వివిధ పంటలలో నానో యూరియా, డిఏపీ వాడకంతో కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నానో యూరియా, డిఏపి వాడకం వల్ల సాంప్రదాయ ఎరువుల అవసరం తగ్గుతుందని ఇది పరిమాణాలలో ఉండి పంటలకు పోషకాలను సమర్థ వం తంగా అందించి దిగుబడిని పెంచుతుందని, పెట్టుబడి ఖర్చు తగ్గి పర్యావ రణా నికి మేలు చేస్తుందని ఏడిఏ చెప్పారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్ గౌడ్, ఎంఏ ఓ బాలకృష్ణ, ఏ ఈ ఓ లు మీనాక్షి , ప్రభావతి, భూదేవి, రైతులు పాల్గొన్నారు.

## ఇంద్రా నగర్ లో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక పనులు ప్రారంభం..

**- పాలకవర్గం గ్రామపంచాయతీ లో సమావేశం**

**- సర్పంచ్ మహబూబ్ బీ ఆధ్వర్యంలో పరిశుభ్రత లో ఇంద్రా నగర్ ముందడుగు**

జిల్లేడు– చౌదరి గూడెం: మేజర్ న్యూస్:( మార్చి:7): మండల పరిధిలోని ఇంద్రా నగర్ లో శనివారం నాడు ఉదయం సర్పంచ్ మహబూబ్ బీ ఆధ్వర్యంలో పరిశుభ్రత పరిరక్షణ పనులు జరుగుతున్నాయి అని సర్పంచ్ మహబూబ్ బీ తెలిపారు. సర్పంచ్ మహబూబ్ బీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి శ్రకారం చుట్టినామని అమే తెలిపారు. మా పాలకవర్గం తో పాటు పంచాయతీ కార్యదర్శి, గ్రామము లో నీ యువత స్ఫూర్తితో గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల లో, యు పి ఎస్ పాఠశాలలో, అంగన్వాడీ, నర్సరీ లో, ఆయా కేంద్రాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి శుభ్ర పరిచామని సర్పంచ్ మహబూబ్ బీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యక్రమాన్ని మార్గదర్శకాలకు అనుగుణంగా అడుగులు వేస్తూ గ్రామాన్ని ముందుకు తీసుకెళ్తానని సర్పంచ్ మహబూబ్ బీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మంగలి శేకర్, సర్పంచ్ తనయుడు అక్రమ్, వార్డు సభ్యులు చెన్నయ్య, రజియా బేగం, ప్రవీణ్, గద్దె శేకర్, బల్వంతు, శ్రీనివాస్ గౌడ్, రహూఫ్, జబ్బార్, శివకుమార్ గౌడ్, యాదగిరి గౌడ్, ఉస్మాన్ గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# పంట మార్పిడితో రైతులు లబ్ధి పొందుతారు

**చేవెళ్ల వ్యవసాయ సంచాలకులు సురేష్ బాబు**



షాబాద్, మేజర్ న్యూస్ (మార్చి 07)షాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల వ్యవసాయ సంచాలకులు సురేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నానో యూరియా, నానో డి ఏ పి వంటి ఎరువులను సరైన మోతాదులో పిచికారి చేయడం ద్వారా పంటల ఎదుగుదల మెరుగు పడడంతో పాటు ఎరువుల ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. పర్యావరణానికి హాని లేకుండా పంటల ఉత్పత్తి పెరుగుతుందని వివరించారు. షాబాద్ మండల వ్యవసాయ అధికారి విజయచంద్ర మాట్లాడుతూ పత్తి హెచ్ టి పత్తి విత్తనాలను వాడడం వలన గ్లైఫోసైట్ అనే కలుపు మందు వాడకం పెరిగి వాతావరణం కలుషితం కావడమే కాకుండా, జీవవైవిద్యం దెబ్బతింటుందని తెలిపారు. అధికంగా కలుపు మందులు వాడడం వల్ల కాలక్రమేణా కలుపు మొక్కలు కూడా వాటిని తట్టుకునే శక్తిని పొందుతాయని తెలిపారు. రైతులు ఒకే పంటగా ఎక్కువ రోజులు సాగు చేస్తే పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందని, అందువల్ల పంట మార్పిడి చేయడం మంచిదని సూచించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షాబాద్ సర్పంచ్ గుండాల అశోక్, హార్టికల్చర్ అధికారి కీర్తి, ఉప సర్పంచ్ దండు రాహుల్, ఏఈఓ శివతేజ, లిఖిత, రాజేశ్వరి, గాయత్రి, గీత, మౌనిక, ఐ ఎఫ్ ఎఫ్ సిఓ ఎరువుల కంపెనీ మార్కెట్ డెవలప్మెంట్ ఆఫీసర్ సంజయ్ భరద్వాజ్, షాబాద్ రైతు ఫెడ్ ఫార్మ్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈఓ చంద్రశేఖర్ రెడ్డి, భారతీయ కిసాన్ సంఘం యాదవ్ రెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.